తిరుపతి - చిత్తూరు

తెలుగు జాతీయ దినపత్రిక

వార్త





# యువ ప్రారిశ్రామికవేత్తలను ప్రోత్సహించడమే ధ్యేయం

-ఘనంగా అమర రాజ వ్యవస్థాపక దినోత్సవం



కార్యక్రమాలను ప్రారంభిస్తున్న ప్రతినిధులు

రేణిగుంట,డిసెంబర్ 20 ప్రభాతవార్త: అమరరాజ సంస్థల్లో పనిచేస్తున్న ప్రతి ఒక్కరి సంక్షేమంతో పాటు గ్రామీణ యువ పారిశ్రామికవేత్తలను ప్రోత్సహిం చడమే అమర రాజ ప్రధాన ఉద్యేశమని సంస్థ ఫౌండర్ చైర్మన్ గల్లా రామచంద్ర నాయుడు, చైర్మన్ గల్లా జయదేవ్ సంయుక్తంగా అన్నారు. రేణిగుంట కరకంబాడి అమరరాజ కంపెనీ ఆడిటోరియంలో శుక్రవారం సంస్థ 39వ వ్యవస్థాపక దినోత్సవం ఘనంగా నిర్వహించారు. సంస్థ ఫౌండర్ చైర్మన్ గల్లా రామచంద్ర నాయుడు, చైర్మన్ గల్లా జయదేవ్, మాజీ మంత్రి గల్లా అరుణకుమారి, అమర ఆసుపత్రి మేనేజింగ్ డైరెక్టర్ రమాదేవి గౌరినేని, అమరరాజ సంస్థల డైరెక్టర్లు హర్షవర్ధన్ గౌరినేని, విక్రమాదిత్య గౌరినేని, సిద్ధార్థ గల్లా, అశోక్ గల్లా, ఆపరేషన్ హెడ్ నర్సింహులునాయుడు జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాలను ప్రారంభించారు. తమిళనాడుకు చెందిన అంతర్ బృందం ప్రదర్శించిన నృత్యం విశేషంగా ఆకర్షించింది. సంస్థలో పనిచేస్తు విశేష ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులు అవార్డులు అందజేశారు. అనంతరం గల్లా రామచంద్ర నాయుడు మాట్లాడుతూ అమర రాజ సంస్థలు ప్రపంచ వ్యాప్తంగా విస్తరించడానికి సంస్థ కార్మికులు, ఉద్యోగులు, హెచ్ఓడిల కృషి ఎంతో ఉందన్నారు. తమ సంస్థ వారి సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తున్నదన్నారు. గ్రామీణ ప్రాంత యువ పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించడం కోసం అమర రాజా సంస్థలు గ్రామీణ ప్రాంతాల్లో పరిశ్రమలు స్థాపించి పలువురికి జీవనోపాధి కల్పించిన ముగ్గురు పారిశ్రామిక వేత్తలను ఎంపిక చేసి వారికి ఒక్కొక్కరికి మూడు లక్షల రూపాయల పారితోషికం అందజేస్తున్నట్లు తెలిపారు. పబ్లిక్ స్పీకర్, వ్యవస్థాపకుడు, పరోపకారి, ఎంఐటి ప్రథమ అంతర్జాతీయ అంధ విద్యార్థి శ్రీకాంత్ బొల్లా గొప్పతనాన్ని ఈ సందర్భంగా కొని ఆడారు. కార్యక్రమంలో అమర రాజ సంస్థల హెచ్ఓడిలు, ఉద్యోగులు, కార్మికులు, పాల్గొన్నారు.

# ప్రకృతి వరం...పులికాట్

- ఫ్లెమింగోల విన్యాసాలు కనువిందు
- జనవరి 10, 11, 12 తేదీల్లో ఫ్లెమింగో ఫెస్టివల్ సందడి





ఫెస్టివల్ నిర్వహణపై అధికారులు సమావేశం

సూళ్లూరుపేట, డిసెంబర్ 20 ప్రభాతవార్త : తెరచాప పడవల అందాలు. వలస పక్షుల విన్యాసాలు. సాంప్రదాయబద్ధంగా మత్స్యకారుల చేపల వేట తనివితీరా వీక్షించాలనుకుంటే పులికాట్ సరస్సు ను సందర్శించాల్సిందే. సూళ్లూరుపేట నుంచి శ్రీహరికోటకు వెళ్లే రోడ్డు మార్గంలో ఈ దృశ్యాలు కంటపడతాయి. ఆంధ్రా, తమిళనాడు రాష్ట్రాల నడుమ దాదాపు 250 చదరపు కిలోమీటర్ల వైశాల్యంలో ఈ సరస్సు విస్తరించి ఉంది. వర్షాకాలంలో వివిధ నదుల నీరు పులికాట్‌కు చేరడంతో సరస్సు విస్తీర్ణం పెరిగి దాదాపు 460 చదపు కిలో మీటర్లకు చేరుకుంటుంది. పులికాట్‌కు విశిష్టత రావడానికి కారణమైన వలస పక్షులు అక్టోబర్ నుంచి ఏప్రిల్ మాసం వరకు సరస్సులో తమ విన్యాసాలతో సందర్శకులకు కనువిందు చేస్తాయి. సూళ్లూరుపేట నియోజకవర్గంలోని దొరవారిసత్రం మండలం నేలపట్టు, వెదురుపట్టు ప్రాంతాల్లో ఈ అరుదైన పక్షుల దేశ విదేశాల నుంచి ఈ విడిది కేంద్రాలకు చేరుకొని సంతానోత్పత్తి కేంద్రంగా ఉపయోగించుకుంటాయి. ఈ పక్షులన్ని ఆహార కేంద్రంగా పులికాట్‌ను ఎంచు కుంటాయి. ఈ పక్షుల కోలాహలంతో పులికాట్ సందడిగా మారుతుంది. పులికాట్‌లోని చేపలు, రొయ్యలు వీటికి ఆహారంగా ఉపయోగపడతాయి. పులికాట్‌కు ప్రతి ఏటా 152 రకాల పక్షి జాతులు వస్తుంటాయి. వీటిలో ఫ్లెమింగోలదే అగ్రస్థానం. ఇవి వేల సంఖ్యలో గుంపులు గుంపులుగా పులికాట్‌లో విహరిస్తుంటాయి. కాగా, ఫ్లెమింగో మాత్రం శాఖాహార పక్షి.



ఎర్రకాళ్ల కొంగలు

పులికాట్‌లోని నాచును ఆహారంగా తీసుకుంటుంది. ఈ పక్షిని వలస పక్షుల్లో రారాజుగా పిలుస్తారు. రష్యా, సైబీరియా, ఉజికిస్తాన్, పాకిస్తాన్, చైనా దేశాలతో పాటు యూరోపియన్ దేశాల నుంచి వేలాది మైళ్ల దూరం ప్రయాణించి ఈ పక్షులు పులికాట్‌కు చేరుకుంటాయి. వీటిలో ముఖ్యమైనవి పెలికాన్, ఎర్రకాళ్ల కొంగలు, తెల్ల కంకణాయిలు, నత్తగుల్ల, పాముమెడ, శబరి కొంగలు ముఖ్యమైనవి. అలాగే నీటి కోడితో పాటు 200 రకాల స్వదేశీ విదేశీ బాతులు, చిన్న చిన్న పక్షులు పులికాట్‌లో కనిపిస్తుంటాయి. ప్రస్తుతం ఈ పులికాట్ విశిష్టతను చాటేందుకు పర్యాటకరంగ ప్రగతిలో భాగంగా 2001 నుంచి ఫ్లెమింగో ఫెస్టివల్ నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగానే 2025 జనవరి 10, 11, 12 తేదీల్లో ఫ్లెమింగో ఫెస్టివల్ నిర్వహించేందుకు సన్నాహాలు ప్రారంభమయ్యాయి.

# కుప్పం ప్రజల...రుణం తీర్చుకుంటాం

-జూలై కల్లా కుప్పానికి హంద్రీ-నీవా జలాలు
-ప్రతి ఇంటికి ఉచితంగా సోలార్ వెలుగులు
- సిఎం సతీమణి నారా భువనేశ్వరి



ఆడవిబూదుగూరులో ముఖాముఖి కార్యక్రమంలో ప్రసంగిస్తున్న నారా భువనేశ్వరి

కుప్పం/కుప్పంరూరల్, డిసెంబర్ 20 ప్రభాతవార్త : సిఎం చంద్రబాబు నాయుడు ఈ ఐదేళ్లలో కుప్పాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తారని తద్వారా తాము కుప్పం ప్రజల రుణం తీర్చుకుంటామని సిఎం చంద్ర బాబునాయుడు సతీమణి, ఎన్టీఆర్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరి పేర్కొన్నారు. నాలుగు రోజుల కుప్పం పర్యటనలో భాగంగా శుక్రవారం మండలంలోని గ్రామీణ ప్రాంతాలైన వానగుట్టపల్లి, అడవి బూదుగూరు, గుండ్లమడుగు గ్రామాల్లో నారా భువనమ్మ పర్యటించారు. మహిళలతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహించడంతో పాటు మహిళల సాధక బాధలు తెలుసుకుని వాటి పరిష్కారానికి హామీ ఇచ్చారు. ఆమె మాట్లాడుతూ సిఎం చంద్రబాబు కుప్పం గురించే మాట్లాడుతుంటారని తనను గెలిపించి ఇంతవాడిని చేసిన కుప్పం ప్రజల రుణం తీర్చుకోలేనని అంటుంటారన్నారు. మరలా చంద్ర బాబును గెలిపించి సిఎం చేశారని వచ్చే ఐదేళ్లలో కుప్పం అభివృద్ధిలో దేశానికే ఆదర్శంగా నిలుస్తుందని పేర్కొన్నారు. వైఎస్సార్సీ పాలనలో కుప్పంలో కక్షపూరితంగా అభివృద్ధి జాడ లేకుండా చేశారన్నారు.

**జూలై కల్లా హంద్రీ- నీవా జలాలు :**

కుప్పం ప్రజలకు వచ్చే జూలై కల్లా హంద్రీ-నీవా జలాలు అందించాలని సిఎం చంద్రబాబు నిర్ణయించారని నారా భువనేశ్వరి పేర్కొన్నారు. కుప్పంలో ప్రతి ఇంటికి సోలార్ వెలుగులు వస్తాయని ప్రభుత్వమే ఖర్చును భరిస్తుందన్నారు. మహిళల కష్టాలు తెలుసుకున్న సిఎం చంద్రబాబు మహిళలు ఎవరిపై ఆధారపడకూడదనే ఉద్దేశంతో డ్వాక్రా సంఘాలకు శ్రీకారం చుట్టారన్నారు. దీంతో నేడు మహిళలు లక్షలాది రూపాయల లావాదేవీలు జరుపుతున్నారన్నారు. మహిళలు ఆనందంగా ఉంటే ఆ కుటుంబం సంతోషంగా ఉంటుందని పేర్కొన్నారు. మహిళల ఆర్థికాభివృద్ధికి ఎలిప్ సంస్థతో ఒప్పందం కుదిరిందన్నారు. మహిళల అభివృద్ధికి వారు తగు సలహాలు, సూచనలు ఇస్తారన్నారు. కుప్పం నుంచి బ్రతుకుతెరువుకై ఇతర రాష్ట్రాలకు వెళ్లకుండా ఉండేలా తాను హామీ ఇస్తున్నట్లు పేర్కొన్నారు. మహిళల కోసం ఎన్టీఆర్ ట్రస్ట్ ద్వారా స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌లో కుట్టుశిక్షణ, అల్లికల్లో శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. కుప్పాన్ని వందశాతం ఎడ్యుకేషన్ హబ్‌గా చేయాలని సిఎం చంద్రబాబు యోచిస్తున్నారన్నారు. కుప్పం ప్రాంతంలో వందశాతం మొబైల్ నెట్‌వర్క్ ఉండేలా చర్యలు చేపట్టారన్నారు. కుప్పంలో రానున్న రోజుల్లో 15323కొత్త ఇళ్లను ప్రభుత్వం నిర్మించనున్నట్లు నారా భువనేశ్వరి పేర్కొన్నారు. గ్రామాల్లో అవసరమైన తాగునీరు, రోడ్లు, వీధిదీపాల ఏర్పాటుకు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. తాగునీటి పథకాలకు 70కోట్లు, డ్రైనేజీల నిర్మాణాలకు 110కోట్లు నిధులు మంజూరైనట్లు పేర్కొన్నారు. రైతుల సౌకర్యార్థం కోల్డ్‌స్టోరేజీల నిర్మాణాలతో పాటు రైతుల పంటల ఎగుమతులకు కుప్పంలో ఎయిర్‌పోర్ట్ సైతం నిర్మించనున్నట్లు చెప్పారు.

**అభివృద్ధి మీకళ్లతోనే చూస్తారు :**

కుప్పం ప్రజలు కొంత ఓపిక పడితే సిఎం చంద్రబాబు చేపట్టే అభివృద్ధి కార్యక్రమాలు మీ కళ్లతోనే చూస్తారని నారా భువనేశ్వరి పేర్కొన్నారు. కుప్పం మున్సిపాలిటీని మోడల్ మున్సిపాలిటీగా చేసేందుకు 450కోట్లతో ప్రతిపాదనలు ఉండగా తొలివిడతగా 50కోట్లు మంజూరుచేశారన్నారు. కుప్పం ఏరియా ఆస్పత్రిని సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రిగా మార్చనున్నట్లు తెలిపారు. 1.40కోట్ల నిధులు ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. వేతనాలు లేక అల్లాడుతున్న ద్రవిడ వర్సిటీ ఉద్యోగులకు 2.86కోట్ల వేతనాలను సిఎం చంద్రబాబు చెల్లించారన్నారు. కుప్పం అభివృద్ధికి నలభై కార్యక్రమాలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు.

పలువురు మహిళల సమస్యలు విన్న నారా భువనేశ్వరి వాటి పరిష్కారానికి హామీ ఇచ్చారు. కాగా గుండ్లమడుగు గ్రామంలో నారా భువనమ్మ తమిళంలో మాట్లాడి ప్రజల్ని ఆకట్టుకున్నారు. కార్యక్రమాల్లో ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ డా.కంచర్ల శ్రీకాంత్, ఎపిఎస్ఆర్టీసీ వైస్‌ఛైర్మన్ పిఎస్ మునిరత్నం, రాష్ట్ర వన్నియకులక్షత్రియ కార్పోరేషన్ ఛైర్మన్ సిఆర్ రాజన్, సలహాదారు నరేష్‌చారి, రాష్ట్ర నేతలు డా॥ బిఆర్ సురేష్‌బాబు, గోపీనాథ్, కురబ కార్పోరేషన్ డైరెక్టర్ రాజగోపాల్, మండల టిడిపి అధ్యక్షుడు ప్రేమ్‌కుమార్, మాజీ ఎంపిపి సాంబశివం, నేతలు రామచంద్ర, మహేంద్ర, విభూషణ్, మోహన్, శివకుమార్, సంజీవరాజులునాయుడు, చిట్టిబాబు, సర్పంచ్ రాజేంద్ర, మహిళా నేతలు అనసూయ, స్వాతి, భాగ్యలక్ష్మి త్రిలోక్, వసంతమ్మ, ఎంపిడిఓ సాయిలహరి, పాల్గొన్నారు.

# ఆక్రమణదారుల ఆట కట్టిస్తా : ఎమ్మెల్యే బొజ్జల



సమావేశంలో మాట్లాడుతున్న సుధీర్‌రెడ్డి

రేణిగుంట, డిసెంబర్20 ప్రభాతవార్త : భూ అక్రమణదారుల ఆటలు కట్టిస్తా నని భూ అక్రమదారులపై ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి నిప్పులు చెరిగారు. రేణిగుంట మండలం అన్నాసంపల్లెపల్లెలో శుక్రవారం జరిగిన రెవెన్యూ సదస్సులో ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సదస్సుకు వచ్చిన ఆయనకు గ్రామ ప్రజలు, పార్టీ నేతలు, కార్యకర్తలు ఘనంగా స్వాగతం పలికారు. భూ సమస్య లపై ప్రజలు ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డికి వినతి పత్రాలు సమర్పించారు. వెంటనే సమస్యలను పరిష్కరించా ల్సిందిగా అధికారులను ఆదేశించారు. సదస్సులో ఎమ్మెల్యే చేతుల మీదగా పదిమందికి ఇంటి స్థల పట్టాలు అందజేశారు. 17ఆర్ఓఆర్లు, 2 సర్వేలు జరిగాయి. ఎమ్మెల్యే మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వంలో ప్రభుత్వ భూములు దాదాపుగా కబ్జాలకు గురయ్యా యన్నారు. గత ప్రభుత్వ పాలనలో ప్రభుత్వ భూములు చాలావరకు కనిపించకుండా పోయాయన్నారు. రాష్ట్రంలోని 175 నియోజకవర్గాల్లో జరగని భూకబ్జాలు శ్రీకాళహస్తి నియోజకవర్గం నందు వైసీపీ పాలనలో జరిగాయన్నారు. కార్యక్రమంలో ఆర్డిఓ భానుప్రకాష్‌రెడ్డి, తహసిల్దార్ సురేష్ బాబు, ఎంపీడీవో విష్ణుచిరంజీవి, ఈవోపీఆర్డి ప్రభు, అర్బన్ సీఐ శరత్ చంద్ర, అర్బన్ ఎస్సై అరుణ్ కుమార్‌రెడ్డి, వెంకటాపురం కార్యదర్శి హరి, తిరుపతి పార్లమెంట్ టిడిపి ఉపాధ్యక్షుడు చెర్లోపల్లి సుబ్రహ్మణ్యంరెడ్డి, టిడిపి మండల పార్టీ అధ్యక్షుడు మునిచంద్రారెడ్డి, రేణిగుంట పట్టణ టిడిపి అధ్యక్షుడు మహబూబ్ బాషా, టిడిపి సీనియర్ నేతలు చిన్నారెడ్డి, డి.పుష్ప నాదం, నెల్లూరు సుబ్రమణ్యం, దేవళ్ల రమణ, కన్నన్‌రెడ్డి, కొరియర్ రవి,నవాబు, నాదమునిరెడ్డి, ముచ్చేలి భాస్కర్ రెడ్డి తదితరులతో పాటు మండలంలోని వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## రెవెన్యూ సదస్సులో...

# తహశీల్దార్‌ను నిలదీసిన జనం



గ్రామ సభలో తహశీల్దార్‌కు సమస్యలు వివరిస్తున్న దృశ్యం

శ్రీకాళహస్తిరూరల్,డిసెంబర్ 20 ప్రభాతవార్త : రెవెన్యూ సదస్సులు సద్వి నియోగం చేసుకో మంటారు. ఇక్కడికిక్కడే సమస్యలు పరిష్కారమంటారు. కార్యాలయానికి కాళ్ళు అరిగేలా తిరిగినా పట్టించుకోరు. విఆర్ఓకు చెబితే ఖాతరు చేయరని శుక్రవారం శ్రీకాళహస్తి మండలం నారాయణ పురం రెవెన్యూ సదస్సులో తహశీల్దార్ లక్ష్మీనారాయణకు ప్రజలు ముచ్చెమటలు పట్టించారు. శ్రీకాళహస్తి మండలంలోని గ్రామాల్లో రెవెన్యూ సదస్సులను చక్కగా ప్రజలు వినియోగించు కుంటున్నారు. తమ గ్రామాల్లోని సమస్యలను అధికారులు,ప్రజా ప్రతినిధులకు విన్నవిస్తున్నారు. నారాయణపురం రెవెన్యూ సదస్సుకు స్థానిక శాసనసభ్యులు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి హాజరౌ తారని తమ సమస్యలను మొరబెట్టుకోవాలని గ్రామస్థులు భావించారు. కానీ ఆయన రాకపోగా, అధికారులు హాజరయ్యారు. దాంతో గ్రామస్థులు తమ గ్రామానికి సంబంధించి పట్టాదారు పాస్ పుస్తకాల పరిస్థితి ఆగమ్యగోచరంగా మారిందన్నారు. తాము పంట పొలాలను సాగు చేసుకుం టుంటే పట్టాదారు పాస్‌పుస్తకాల్లో ఇతరుల పేర్లు ఎలా వచ్చాయని ప్రశ్నల వర్షం కురిపించారు. తమ బాధలను విన్నవించు కొనుటకు ఎన్ని సార్లు తహశీల్దార్ కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నాము. ఎన్ని సార్లు దరఖాస్తులు ఇవ్వాలి. సచివాలయం అంటారు. విఆర్ఓకు సమస్య చెబుదా మంటే ఆయన ఆకాశాన్ని చూస్తారు. అంటూ తహశీల్దార్ దృష్టికి తెచ్చారు. ప్రజల ఆగ్రహావేశాలను పరిశీలించిన తహశీల్దార్ లక్ష్మీనారాయణ సమయస్పూర్తితో సంయమనంతో శాంతింప జేసారు. మీ సమస్యలు పరిష్కారం కావాలి అంతే కదా? ఇక నేనే ఫీల్డ్‌కు వస్తాను పరిశీలిస్తాను. క్షేత్రస్థాయిలో అక్కడికక్కడే పరిష్కరిస్తాను. అంతేకాకుండా పాస్‌పుస్తకాల సమస్యలను కంప్యూటర్లలో పరిశీలించి సరి చేస్తామంటూ గ్రామస్థులను శాంతింపజేసారు.

# ట్రాఫిక్ నియమాలు ఉల్లంఘిస్తే... కఠిన చర్యలు : డిఎస్పీ



తిరుపతి కార్పొరేషన్, డిసెంబర్ 20 ప్రభాతవార్త : ట్రాఫిక్ నియమాలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా ట్రాఫిక్ డిఎస్పీ రామకృష్ణాచారి పేర్కొన్నారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ డిఎస్పీ మాట్లాడుతూ ప్రజలు ట్రాఫిక్ నియమ నిబంధనలను తప్పకుండా పాటించాలని, అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవు అన్నారు. జిల్లా ఎస్పీ ఎల్.సుబ్బారాయుడు ఆదేశాల మేరకు ట్రాఫిక్ డిఎస్పి రామకృష్ణచారి, కేసుల వివరాలు వెల్లడించారు. తిరుపతి పట్టణ పరిధిలో ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘిస్తూ వాహనాలు నడిపిన డ్రైవర్ల పై ట్రాఫిక్ పోలీసు వారు డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులను నమోదు చేసి 42 మంది ముద్దాయిలను 4వ అడిషనల్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ కోర్టు తిరుపతి నందు హాజరు పరచగా గౌరవ జడ్జి గ్రంధి శ్రీనివాస్ గారు ఒక్కొక్కరికి పదివేలు చొప్పున మొత్తం 42 మందికి 4లక్షలు జరిమానా విధించారు. తిరుపతి ట్రాఫిక్ పోలీసుల పనితీరును జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు, అభినందించినారు. తిరుపతి నగర ప్రజలకు ట్రాఫిక్ సమస్య తలెత్తకుండ బాధ్యతతో విధులు నిర్వర్తించాలని సూచించారు.

# పిల్లలకు ఏడేళ్ళొస్తేనే...ఇక ఒకటో తరగతి !

-4ఏళ్ళకే నర్సరీకి ఛలో
-సెకండరీ కోర్సులు నాలుగు సంవత్సరాలు



**ప్రభాతవార్త-తిరుపతి:**

ఇప్పటివరకు ప్రాథమికదశలో అమలవుతున్న పాత విద్యావిధానానికి కేంద్రం స్వస్తిచెప్పింది. ఆ స్థానంలో కొత్త విద్యావిధానం ప్రవేశపెట్టేందుకు నిర్ణయించి అమలుచేసేందుకు సిద్ధమైంది. తాజాగా కొత్త విద్యా విధానానికి కేంద్రమంత్రి వర్గం ఆమోదం తెలపడం విశేషం. మూడున్నర దశాబ్దాల తరువాత దేశంలో కొత్త విద్యావిధానం అమల్లోకి రానుంది. 2025-26 విద్యాసంవత్సరం నుండి అమలుచేసే దిశగా అన్ని రాష్ట్రప్రభుత్వాలకు ఆదేశాలందనున్నాయి. ఇదివరకు పిల్లలకు ఐదుసంవత్సరాలు నిండితేనే బడికి పంపే విధానంలో మార్పులు తీసుకువచ్చారు. నాలుగు సంవత్సరాలు నిండిన పిల్లలను నర్సరీ పేరుతో బడిలో చేర్పితే ఐదేళ్ళ వయస్సుకు జూనియర్ కేజి(ఎల్‌కెజి), ఆరేళ్ళ వయస్సుకు సీనియర్ కేజి(యుకెజి) పేరుతో బడిలో పిల్లలు ఉంటారు. ఏడు సంవత్సరాలు వయస్సు పిల్లలు 1వతరగతిలో చేరి చదువును అభ్యసించనున్నారు. ఇలా 11సంవత్సరాలు వయస్సుకు ఐదవతరగతిలో ఉంటారు. ఈ విద్యా సంవంత్సరంలో మార్పులతో పిల్లల్లో మేథోశక్తి అభివృద్ధి చెందుతుందని, చదువు పట్ల పిల్లలు ఆసక్తిచూపుతారని మేదావుల అభిప్రాయం. గతంలో కొన్ని సంవత్సరాల క్రిందట వరకు 7వతరగతి పబ్లిక్ పరీక్షలను కూడా ప్రభుత్వం రద్దుచేసింది. ఏకంగా 10వతరగతిలోనే పబ్లిక్ పరీక్షలు నిర్వహిస్తు న్నారు. కొత్తవిదానంలో 10 పరీక్షలు కూడా రద్దుచేసి ఇంటర్‌లోనే (12వతరగతిలోనే) బోర్డు పరీక్షలు పబ్లిక్ పరీక్షలుగా నిర్వహించేలా కార్యాచరణ రూపొందించారు. ఐదవతరగతి వరకు విద్యార్థులకు మాతృబాష(స్థానిక భాష),జాతీయ భాషలో బోధిస్తున్నారు. మిగిలిన సబ్జెక్టులు ఆంగ్లమీడియం అయినా ఒక సబ్జెక్టుగానే బోధన ఉంది. ఇప్పటివరకు 10వతరగతి పబ్లిక్ పరీక్షలకు హాజరు తప్పనిసరిగా ఉండి ఆ ఫలితాలతోనే కొన్ని ప్రభుత్వ ఉద్యోగాలకు అర్హతగా ఉంది. ఈ విధానం మార్పుచేసి ఇంటర్‌ను ప్రాథమిక అర్హతగా తీసుకోనున్నారు. డిగ్రీ విద్యావిధానంలో కూడా మార్పులు రానున్నాయి. మరీ నూతన విద్యాసంవత్సరంలో కొత్త విద్యావిధానంపై మేదావులు, విద్యావేత్తలు అభిప్రాయాలు ఏకీభవిస్తాయా అనేది చూడాల్సిందే.

# భక్తులను మోసగించిన... దళారీ అరెస్టు



తిరుమల,డిసెంబర్ 20 ప్రభాతవార్త ప్రతినిధి: టిటిడి ఉద్యోగినంటూ అమాయక భక్తులను నమ్మించి పలు రకాల దర్శనాలు చేయిస్తానని డబ్బులు తీసుకుని దర్శనాలు చేయించకుండా మోసం చేస్తున్న దళారీ లలిత్‌కుమార్ గుండపు (35)ను తిరుమల 2టౌన్ పోలీసులు అరెస్టుచేశారు. అతనిపై పలు కేసులు నమోదైనట్లు తెలిపారు. 2టౌన్ సిఐ రాయుడు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. చీరాల బాపట్లకు చెందిన లలిత్‌కుమార్ తనకు తానుగా టిటిడి ఉద్యోగినంటూ భక్తులను పరిచయం చేసుకుంటాడు. గతంలో పరకామణిలో ఔట్‌సోర్సింగ్‌గా పనిచేశాడు. తరచూ తిరుమలకు వచ్చినపుడు తనకు తెలిసిన వారితో మఠాల్లో గదులు బుక్‌చేసుకోవడం, దర్శనాలు చేయిస్తానని భక్తులను నమ్మిస్తాడు. ఇలా హైదరా బాద్, బెంగుళూరు నగరాల్లో ఉంటూ పరిచ యస్థులతో దర్శనాలు చేయిస్తానని నమ్మించేవాడు. 2023-24 సంవత్సరాల్లో దాదాపు 80లక్షలు రూపాయల వరకు డిజిటల్ పేమెంట్స్ రూపంలో లావాదేవీలు జరిపించాడు. 2017వ సంవత్సరం నుండి తిరుమల 2టౌన్‌లో ఆరుకేసులు నమోదయ్యాయి. పలువురు బాధితుల ఫిర్యాదుతో తిరుమల 2టౌన్ పోలీసులు అరెస్టుచేసి అతని నుండి సెల్‌ఫోన్, ద్విచక్రవాహనం స్వాధీనం చేసుకున్నట్లు సిఐ తెలిపారు. కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి రిమాండ్‌కు ఆదేశించారు.

## రోడ్డు ప్రమాదంలో ...

# ఇద్దరు విద్యార్థులు దుర్మరణం



రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన విద్యార్థులు హర్ష, సాయితేజలు

తవణంపల్లి, డిసెంబర్ 20 ప్రభాతవార్త: ముందు వెళ్తున్న ఆర్టీసీ బస్సును ఓవర్ టేక్ చేస్తూ ఎదురుగా వస్తున్న ప్యాసింజర్ ఆటోను ఢీకొనడంతో మోటర్ సైకిల్‌పై వెళ్తున్న ఇద్దరు విద్యార్థులు దుర్మరణం పాలైన సంఘటన మండలంలోని అరగొండ-చిత్తూరు రహదారిలోని ముత్తరపల్లి వద్ద శుక్రవారం ఉదయం చోటు చేసుకుంది. సంఘటనకు సంబంధించి వివరాలిలా వున్నాయి. మండలంలోని మైన గుండ్లపల్లికి చెందిన ప్రసాద్‌రెడ్డి కుమారుడు హర్ష(17), ముత్తరపల్లి అరుంధతి వాడకు చెందిన సాయితేజ(18)లు చిత్తూరు సీతమ్ ఇంజనీరింగ్ కళాశాలలో విద్యనభ్యసిస్తున్నారు. వీరిద్దరు శుక్రవారం ఉదయం మోటర్ సైకిల్‌పై కళాశాలకు ఉదయం 10 గంటలకు బయలు దేరారు. ఈ నేపథ్యంలో ముత్తరపల్లి వద్ద ముందు వెళ్తున్న ఆర్టీసీ బస్సును ఓవర్‌టేక్ చేసే క్రమంలో ఎదురుగా వస్తున్న ప్యాసింజర్ ఆటోను వేగంగా వెళ్ళి బలంగా ఢీ కొన్నారు. దీంతో వీరిద్దరు రోడ్డుపై పడటంతో తలకు తీవ్ర గాయాలై ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందారు. ఈ మేరకు తవణంపల్లి పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి దర్యాప్తు చేపట్టారు. ఇద్దరు విద్యార్థులు మృతి చెందడంతో వారి తల్లిదండ్రులు సంఘటనా స్థలంలో కన్నీరుమున్నీరుగా విలపించారు.

## ఏరియా ఆస్పత్రిలో రోగులకు...

### సకాలంలో వైద్య సేవలు అందించాలి : కలెక్టర్

కుప్పం, డిసెంబర్ 20 ప్రభాతవార్త :



కుప్పం ఏరియా ఆస్పత్రికి వచే ్చ రోగులకు సకాలంలో వైద్యులు వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారు. శుక్రవారం కడ ప్రాజెక్ట్ డైరెక్టర్ వికాస్ మర్మత్‌తో కలసి ఏరియా ఆస్పత్రిలో కలెక్టర్ ఆకస్మిక తనిఖీ చేపట్టారు. ఆస్పత్రిలో అన్ని వార్డులు పరిశీలిం చడంతో పాటు ఫార్మసీ విభాగంలోని మందులను తనిఖీ చేశారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆస్పత్రిలో రోగులకు అందించే మందులకు సంబంధించి అవి అందుబాటులో లేకుంటే వెంటనే కొనుగోలు చేసి అందించాలని ఆదేశించారు. గడువు తీరిన మందులను రోగులకు ఇవ్వకముందే తొలగించాలని విధుల పట్ల బాధ్యతతో ఉండాలని ఫార్మసిస్టులను ఆదేశించారు. ఏరియా ఆస్పత్రికి అత్యవసరమైన మందులు, పరికరాలను ఆస్పత్రి అభివృద్ధి నిధి నుంచి కొనుగోలు చేయాలన్నారు. రోగులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా వైద్య సేవలు అందించాలని ఆస్పత్రి సూపరింటిండెంట్ విజయకుమారిని ఆదేశించారు. కార్యక్రమంలో వైద్యులు పాల్గొన్నారు.

## ఆలిండియా అంతర్‌వర్సిటీ ఫుట్‌బాల్ టోర్నీకి కెఇసి విద్యార్థులు



**కుప్పం, డిసెంబర్ 20 ప్రభాతవార్త :** కాలికట్ యూని వర్సిటీలో సోమవారం నుంచి జరిగే ఆలిండియా అంతర్ వర్సిటీ ఫుట్‌బాల్ టోర్నీలో అనంతపురం జె ఎన్‌టియు జట్టు తరపున కుప్పం ఇంజనీరింగ్ కాలేజ్ విద్యార్థులు అబిన్‌బేబీ, శ్రీహరి, డిరిన్‌డేవిష్ పాల్గొం టున్నట్లు బిసిఎన్ గ్రూప్స్ ఛైర్మన్ బిసి నాగరాజ్ తెలిపారు. వీరు గత నెలరోజులుగా ప్రత్యేక శిక్షణ సైతం పొందినట్లు చెప్పారు. జాతీయ స్థాయిలో తమ విద్యార్థులు విజయం సాధించాలని ఆయన ఆకాంక్షించారు. కార్యక్రమంలో కాలేజ్ వైస్ ఛైర్మన్ డాక్టర్ సునీల్ రాజ్, సిఇఒ సాగర్ రాజ్, ప్రిన్సిపాల్ డాక్టర్‌సుధాకర్‌బాబు, వైస్ ప్రిన్సిపాల్ భాస్కరన్, పిడి సతీష్‌కుమార్, పిఆర్వో ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

## వెండికిరీటం సమర్పించిన భువనమ్మ

కుప్పంరూరల్, డిసెంబర్ 20 ప్రభాతవార్త :



కుప్పం మున్సిపల్ పరిధి మోడల్ కాలనీ సమీపంలో ఉన్న శ్రీ ప్రత్యంగిరాదేవి అమ్మవారికి శుక్రవారం నారా భువనేశ్వరి వెండి కిరీటాన్ని సమర్పించారు. చంద్ర బాబునాయుడు ముఖ్యమంత్రి అయితే అమ్మవారికి వెండికిరీటం సమర్పిస్తామని గతంలో నారా భువనమ్మ మొక్కుకున్నారు. దీంతో శుక్రవారం భువనమ్మ అమ్మవారి ఆలయంకు చేరుకుని వెండికిరీటం సమర్పించి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమాల్లో ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, సలహాదారు నరేష్‌చారి, మున్సిపల్ కమీషనర్ శ్రీనివాసరావు, మున్సిపల్ టిడిపి అధ్యక్షుడు రాజ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి ఆర్ముగ ం, మహిళా నేత తిరుమగళ్ తదితరులు పాల్గొన్నారు.

## గోకులం షెడ్ల నిర్మాణాలు త్వరగా పూర్తి చేయాలి

### – జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్



కుప్పంరూరల్, డిసెంబర్ 20 ప్రభాతవార్త : రాష్ట్ర ప్రభుత్వం పాడి రైతులకు మంజూరు చేసిన పశువుల గోకులం షెడ్ల నిర్మాణాలను పాడి రైతులు త్వరగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారు. శుక్రవారం మండ లంలోని పెద్దగోపనపల్లి, దాసేగానూరు గ్రామాల్లో గోకులం షెడ్ల నిర్మాణాలు, డ్రిప్ సాగు పద్ధతులను కడ ప్రాజెక్ట్ డైరెక్టర్ వికాస్ మర్మత్‌తో కలసి పరిశీలి ంచారు. కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పాడి రైతులకు రాయితీతో గోకులం షెడ్లను మంజూరుచేసిందన్నారు. ప్రతి రైతు వ్యవసాయంతో పాటు పశుపోషణతో జీవనం సాగిస్తున్నారని తద్వారా రైతులకు మేలు కలుగుతోం దన్నారు. ప్రభుత్వం సూచించిన నమూనా మేరకే షెడ్ల నిర్మాణాలు చేపట్టాల న్నారు. బిందుతుంపర్ల సేద్యం పరికరాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈసందర్భంగా వెంకటాచలం అనే రైతు పొలాన్ని పరిశీలించి రూఫ్ లెవెల్‌లో ఉన్న షెడ్డు నిర్మాణంను పరిశీలించారు. మంకలదొడ్డిలో ఆరు షెడ్ల నిర్మాణాలు పూర్తయ్యాయని తమకు షెడ్ల నిర్మాణంతో ఎంతో ఉపయోగం ఉందని రైతులు కలెక్టర్‌కు వివరించారు.

## రాజ్యాంగం లేకుంటే రాజకీయమే లేదు : చింతా మోహన్



**తిరుపతి హెల్త్, డిసెంబర్ 20 ప్రభాతవార్త :** ప్రపంచ మేధావి, రాజ్యాంగ సృష్టికర్త బిఆర్ అంబేద్కర్ యొక్క విలువ తెలియని కేంద్ర హోంశాఖమంత్రి అమిత్షా చేసిన అనుచిత వ్యాఖ్యల్ని ఖండిస్తూ మాజీ కాంగ్రెస్ మంత్రి చింతా మోహన్ ప్రెస్ క్లబ్‌లో శుక్రవారం మీడియాతో మాట్లాడారు పేద కుటుంబం నుండి వచ్చిన అంబేద్కర్ విలువలతో కూడిన జీవితాన్ని గడిపారని కొనియా డారు. ప్రపంచంలో అతి కొద్ది మంది మేధావులలో అంబేద్కర్ ఒక్కడన్నారు. ఆయన రాసిన రాజ్యాంగం వెనుక నెహ్రూ , గాంధీల ప్రేమేయం ఉందని గత చరిత్రను గుర్తు చేశారు. అంబేద్కర్ రాసిన రాజ్యాంగం లేకుంటే నేడు విమర్శించిన వారికి పదవులే లేవన్నారు. ఆ స్థాయికి వారు వెళ్లి ఉండరన్నారు. ఈ విలేకరుల సమావేశంలో యార్లపల్లి గోపి , తేజోవతి, శివశంకర్, వెంకటేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## ఆంధ్రప్రదేశ్ మెడికల్ ఏంప్లాయిస్ రాష్ట్ర కోశాధికారిగా పుట్టా



తిరుపతి హెల్త్, డిసెంబర్ 20 ప్రభాతవార్త : ఆంధ్రప్రదేశ్ మెడికల్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ 6వ మహాసభలు విజయవాడలో జరిగాయి. ఈ మహాసభకు తిరుపతి జిల్లా నుండి 14 మంది ప్రతినిధులుగా పాల్గొన్నారు. ఈ మహాసభలలో నూతనంగా ఎన్నికైన రాష్ట్ర కమిటీలోకి తిరుపతి జిల్లాకు మంచి ప్రాధాన్యత లభించింది. రాష్ట్ర కోశాధికారిగా పుట్టా మహేంద్ర కార్యవర్గ సభ్యులుగా నరసింహులు పురుషోత్తం కిషోర్‌లు ఎన్నికైనట్లు ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాధాకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. ఆరవ మహాసభలలో తిరుపతి జిల్లాకు మంచి ప్రాధాన్యత లభించిందని రాష్ట్ర కోశాధికారిగా, పుట్టా మహేంద్ర కార్యవర్గ సభ్యులుగా నరసింహులు, పురుషోత్తం,కిషోర్లు ఎన్నిక కావడం మంచి పరిణామం అని ఆయన అన్నారు. రాష్ట్ర నాయకులు పైన అలాగే జిల్లా నిర్మాణం విస్తరణ కార్యకర్తలకు రాజకీయ అవగాహన పెంచు తూ సంఘ విస్తరణకు కృషి చేస్తామని నూతనంగా ఎన్నికైన నాయకత్వం ప్రకటించడం జరిగిందని ఆయన అన్నారు.

## నిత్యన్నదాన పథకానికి రూ.లక్ష విరాళం

కాణిపాకం, డిసెంబర్ 20 ప్రభాతవార్త:



కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామి దేవస్థానంలో అమలు అవుతున్న నిత్యఅన్నదాన పథకానికి శుక్రవారం లక్ష రూపాయలు విరాళం అందజేశారు. హైదరాబాదుకు చెందిన చంద్రారెడ్డి, విజయవాడకు చెందిన చల్లా శివమీనాక్షి అనే భక్తులు ఒక్కొకరు 1,00,116 రూపాయలు చొప్పున విరాళంగా అందజేశారు. ఈ మొత్తంను దాత కుటుంబ సభ్యులతో కలిసి ఆలయ ఎఇఒ రవీంద్రబాబుకు అందజేశారు. దాతలకు ఆలయ సంప్రదాయ ప్రకారం స్వామి వారి దర్శనం కల్పించి తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ సూపరిటెండెండ్లు వాసు, కోదండపాణి, టెంపుల్ ఇన్స్‌పెక్టర్ చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షురాలిగా ప్రమీల

చిత్తూరు, డిసెంబర్ 20 ప్రభాతవార్త:



జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షురాలిగా వెదురు కుప్పం మండలానికి చెందిన ప్రమీళ శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నిక య్యారు. జిల్లా మహిళా సమాఖ్య కార్యాలయంలో శుక్రవారం జిల్లా గ్రామీణా భివృద్ధి సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీదేవి ఆధ్వర్యంలో జిల్లా మహిళా సమాఖ్య 21వ వార్షిక మహాసభ జరిగింది. ఈ సమావేశంలో జిల్లా సమాఖ్య సభ్యులు నూతన కార్యవర్గంను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ మేరకు జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షురాలిగా ప్రమీల (వెదురుకుప్పం), కార్యదర్శిగా కార్తీ(గుడిపాల), కోశాధి. కారిగా ప్రసన్న(పూతలపట్టు), ఉప కార్యదర్శిగా గౌతమి(కుప్పం), ఉపాధ్యక్షు రాలుగా చిన్నరెడ్డమ్మ(పెద్దపంజాణి), వ్యవస్థాపక సభ్యులుగా సుమలత (పలమనేరు), సరసమ్మ(గంగవరం), ప్రభావని(చౌడేపల్లి), ప్రభావతి(నగరి), మహేశ్వరీ (వి.కోట), రజియా (యాదమరి), శిరీష(రామకుప్పం)లు ఎన్నికయ్యారు. జిల్లా మహిళా సమాఖ్య కార్యవర్గ సభ్యులుగా ఎన్నికైన వారిని డిఆర్‌డిఎ పిడి శ్రీదేవి, డిఆర్‌డిఎ అధికారులు అభినందించారు.

## అర్హత లేనివారికి గోకులం షెడ్లు!

పాలసముద్రం, డిసెంబర్ 20 ప్రభాతవార్త:

అర్హత లేని వారికి గోకులం షెడ్లు మంజూరు చేయాలని అధికార తెలుగుదేశం పార్టీ నాయకులు ఇటు అధికారులు, అటు సర్పంచ్‌లపై ఒత్తిడి తీసుకువస్తున్నారు. పాలసముద్రం మండలంలో పాడి రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం గోకులం షెడ్లను మంజూరు చేసింది. ఈ మేరకు అధికార తెలుగుదేశం పార్టీ నాయకులు సిఫార్సు చేసిన వారందరికీ అధికారులు గోకులం షెడ్లను మంజూరు చేశారు. అయితే పాలసముద్రం మండలానికి చెందిన ఓ వ్యక్తి మండల పరిధిలో అనర్హులైన వారికి గోకులం షెడ్లు మంజూరు చేశారని అలాంటి వాటిని పరిశీలించి రద్దు చేయాలని ఫిర్యాదు చేశాడు. ఈ ఫిర్యాదు మేరకు జిల్లా అధికారులు పక్కాగా వ్యవహరించడంతో మండలంలో అనర్హులకు మంజూరు చేసిన కొన్ని గోకులం షెడ్లు రద్దు చేశారు. ఈ మేరకు మండల పరిధిలో అధికారులు అర్హులైన వారికి గోకులం షెడ్లను మంజూరు చేస్తారా! లేక అనర్హులైన వారికి మంజూరు చేసి చేతులు దులుపుకుంటారా! చూడాల్సి వుంది.

## వైఎస్ జగన్‌ది...దోపిడి విజన్

### – రాష్ట్ర తెలుగుదేశం అధికార ప్రతినిధి

చిత్తూరు, డిసెంబర్ 20 ప్రభాతవార్త:



తెలుగుదేశం అధినేత, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుది అభివృద్ధి విజన్ అయితే ప్రతిపక్ష నేత, వైకాపా అధినేత వైఎస్ జగన్మోహన్‌రెడ్డిది దోపిడి విజన్ అని రాష్ట్ర తెలుగుదేశం అధికార ప్రతినిధి వెంకిటీల సురేంద్రకుమార్ అన్నారు. జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో రెడ్ బుక్ రాజ్యాంగం అమలు అవుతుందని ప్రతిపక్ష నేత వైఎస్ జగన్ కారుకూతలు కూస్తున్నారని, రాష్ట్రంలో డాక్టర్ బిఆర్ అంబేద్కర్ రాజ్యాంగం అమలు అవుతుందన్నారు. రాష్ట్రంలో ఎన్నికల్లో ఇచ్చిన హామీల మేరకు సూపర్ సిక్స్ పథకాలు అమలు ప్రారంభం అయ్యాయన్నారు. పెన్షన్‌ను 3 వేల రూపాయల నుండి 4 వేల రూపాయలకు పెంచి ప్రతి నెలా ఒకటవ తేదీన లబ్దిదారులకు అందించడం జరుగుతున్నదన్నారు. కుంభకోణాలకు వైఎస్ జగన్ బ్రాండ్ అంబాసిడర్ అని ఆరు నెలలుగా ప్రభుత్వంలో ఏ ఒక్క కుంభకోణం జరుగలేదని ఆయన స్పష్టం చేశారు. ఈ సమావేశంలో రాష్ట్ర తెలుగుదేశం అధికార ప్రతినిధి సప్తగిరి ప్రసాద్, జిల్లా తెలుగుదేశం కార్యాలయ కార్యదర్శి మోహన్‌రాజ్, దేశం నాయకులు ధరణి, గోపాల్, సురేష్, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

## జీవన ప్రమాణం పెంచే దిశగా చర్యలు : డిఎంహెచ్ఓ ప్రభావతి

చౌడేపల్లి, డిసెంబర్ 20 ప్రభాతవార్త :



ముందుగా వచ్చే వ్యాధులను పసిగట్టి ప్రజల జీవన ప్రమాణాలను పెంచే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకొంటోందని జిల్లా వైద్యాధికారిణి ప్రభావతిదేవీ అన్నారు. శుక్రవారం స్థానిక ఆరోగ్య కేంద్రాన్ని ఆమె ఆకస్మికంగా తనిఖీ చేసారు. జిల్లాలోని 8మండలాల్లో ప్రజ ఆరోగ్య కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ప్రతి యూనిట్‌కు భవన నిర్మాణం కోసం ప్రభుత్వం రూ. 50లక్షలను మంజూరు చేసిందనీ, టెండర్ల ప్రక్రియ పూర్తయ్యాక నిర్మాణాలు చేపడుతారన్నారు. ఇప్పటికే వివిధ రకాల వ్యాధులను ముందుగానే పసిగట్టేందుకు స్కానింగ్ పరికరాలు ఆసుపత్రులకు పంపిణీ చేశారన్నారు. కోవిడ్ వంటి పరిస్థితులు వచ్చినప్పుడు ప్రజా ఆరోగ్య కేంద్రాల ద్వారా పరీక్షలు చేసేందుకు వీలుగా అన్ని చర్యలు తీసుకొంటున్నామన్నారు. వైద్యాధికారి పవన్‌కుమార్, పిహెచ్ఎన్ కృష్ణవేణి, జమున, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

## పరిష్కారానికై రెవెన్యూ సదస్సులు : ఆర్డీఓ

పలమనేరు,డిసెంబర్ 20 ప్రభాతవార్త:



భూ సమస్యలను తక్షణం పరిష్కారిం చటం కోసం రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తునట్లు పలమనేరు ఆర్డీఓ భవాని తెలిపారు.పలమనేరు మండలంలోని శ్రీరంగరాజపురంలో శుక్రవారం జరిగిన రెవెన్యూ సదస్సులలో ఆమె పాల్గొన్నారు.ఈ మేరకు సదస్సులలో వచ్చిన అర్జీలను ఆమె పరిశీలించి వాటి పరిష్కారానికి తక్షణం కృషి చేయాలని సిబ్బందికి సూచించారు. ఆమె మాట్లాడుతూ సమస్యల పరిష్కారానికై నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ఇన్బనాథన్,రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## శక్తిస్వరూపిణీకి రాహుకాలాభిషేకం

బోయకొండ(చౌడేపల్లి), డిసెంబర్ 20 ప్రభాతవార్త :



శక్తిస్వరూపిణీ బోయకొండ గంగమ్మకు రాహు కాలాభిషేకాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. రాహుకాల సమయంలో దంపతుల సమక్షంలో ఆలయ అర్చకుల ఆధ్వర్యంలో జరిగిన అభిషేకం భక్తులను అలరించింది. పలమనేరుకు చెందిన నవీన్‌కుమార్ అతని మిత్ర బృందం అన్నదాన శిబిరానికి కూరగాయలు విరాళంగా అందించారు. ఆలయ ఇఒ, ఉపకమీషనర్ ఏకాంబరం, అధికార, సిబ్బంది సేవలందించారు.

## సదస్సులో సమస్యలే సమస్యలు...!



దిగువపల్లి(చౌడేపల్లి), డిసెంబర్ 20 ప్రభాతవార్త : దిగువపల్లి రెవిన్యూ సదస్సు లో భూ సమస్యల కోసం అధికంగా వినతిపత్రాలందించారు. దాదాపు వందకు పైగా రైతులు సమస్యలున్నాయని అధికారులతో విన్నవించుకొన్నారు. శక్తిక్షేత్రం బోయకొండ గంగమ్మ ఆలయం దిగువపల్లి రెవిన్యూలో వున్నందునే ఈ పరిస్థితి ఏర్పడిందని పలువురన్నారు. పక్షిరాజపురం, శికారిపాళెం, బోయకొండ గంగా పురం, భవానీనగర్, కొలింపల్లి, అట్లవారిపల్లి, మేకలవారిపల్లి తదితర గ్రామాలు దిగువపల్లి రెవిన్యూకు చెందినవి. ఆయా గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భూసమస్యలున్నాయంటూ రైతులు అధికారులకు మొరపెట్టుకొన్నారు. ఇప్పటి వరకు మండలంలో జరిగిన సదస్సులు వంద మేర అర్జీలు రావడం ఇదే ప్రథమం. ఆయా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని డిటి మాధవి రైతులకు హామీ ఇచ్చారు. తేదేపా నాయకుడు బోయకొండ సుబ్బు, రామకృష్ణ, ఆర్ఐ భారతి, మండల సర్వేయర్ గుణశేఖర్, విఆర్వోలు ఈశ్వర్, మల్లికార్జునరెడ్డి, రెవిన్యూ, సచివాలయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

## సౌత్‌జోన్ ఇంటర్ యూనివర్శిటీ క్రీడలకు..

చిత్తూరురూరల్, డిసెంబరు 20 ప్రభాతవార్త:



ఈనెల 27నుంచి కాలికట్‌లో జరగబోవు సౌత్‌జోన్ ఇంటర్ యూనివర్శిటీ ఉమెన్ టోర్నమెంట్‌కు శ్రీ వెంకటే శ్వర విశ్వవిద్యాలయం తరపున తమ కళాశాలలో బిఏ మొదటి సంవత్సరం చదువుతున్న హేమలత ఖోఖో పోటీలకు, బికాం ద్వితీయ సంవత్సరం చదువుతున్న సంధ్య హాకీ పోటీలకు ఎంపికైనట్లు శ్రీమతి ఎన్‌పి సావిత్రమ్మ మహిళా ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ డా.కె.మనోహర్ తెలిపారు. కాగా ఎంపికైన విద్యార్థినులను కళాశాల వైస్‌ప్రిన్సిపాల్ నరేంద్ర, ఫిజికల్ డైరెక్టరు సురేష్, అధ్యాపక, అధ్యాపకేతర బృందం అభినందనలు తెలిపారు.

## ఆర్థికంగా మహిళలు ముందడుగు : అసిస్టెంట్ కలెక్టర్

చిత్తూరు, డిసెంబర్ 20 ప్రభాతవార్త:



మహిళలు ప్రభుత్వ పథకాలను సద్వి నియోగం చేసుకుని ఆర్థికంగా ముందడుగు వేయాలని అసి స్టెంట్ కలెక్టర్ హిమ వంశీ అన్నారు. కలెక్టరే ట్‌లోని జ్యోతిరావ్‌పూలే భవనంలోని డిఆర్‌డిఏ సమా వేశహాలులో శుక్రవారం జిల్లా సమాఖ్య 21వ వార్షిక మహాసభ నివేదిక కార్యక్రమానికి ట్రైనీ కలెక్టర్ హిమవంశీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌డిఏ పిడి శ్రీదేవి, జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు సుకన్య తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అసిస్టెంట్ కలెక్టర్ మాట్లాడుతూ చిత్తూరు జిల్లాలో విధులు నిర్వర్తించడం తనకు ప్రత్యేకంగా వుందని, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ నిర్వహించే కార్యక్రమాల్లో పాల్గొనడం తనకు సంతోషం కలుగజేస్తుందన్నారు. మహిళా సాధికారతకు జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ కీలక పాత్ర పోషిస్తుందన్నారు. మహిళలు ఆర్థికంగా ముందడుగు వేయడానికి జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో పలు పథకాలు అమలు అవుతున్నాయ న్నారు. ఈ పథకాలను జిల్లా సమాఖ్య సభ్యులు సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా ముందుకు సాగాలన్నారు. రుణాలు పొందిన మహిళలు వాటిని సకాలంలో తిరిగి బ్యాంకులకు చెల్లిస్తే మరింత పెద్ద మొత్తం రుణం తీసుకోవడానికి అవకాశం వుంటుందన్నారు. డిఆర్‌డిఏ పిడి శ్రీదేవి మాట్లాడుతూ మహిళలు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకుని అభివృద్ధి చెందాలని, బ్యాంకుల ద్వారా తీసుకున్న రుణాలను సకాలంలో తిరిగి చెల్లించి మరింత పెద్ద మొత్తంలో రుణాలు పొందాలని సూచించారు. మహిళలు కలసికట్టుగా పని చేసి రుణాలు తిరిగి చెల్లించానికి కృషి చేయాలన్నారు. ఈ సమావేశంలో డిఆర్‌డిఏ ఎపిడి రవికుమార్, డిపిఎంలు రవికుమార్, ఎపిఎంలు మధు, సుబ్బారెడ్డి, అరుణ, జ్యోతి, హేమ, జిల్లా సమాఖ్య కార్యవర్గ సభ్యులు, పెద్ద ఎత్తున మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

## గుంతలు లేని రోడ్లే లక్ష్యం : టిడిపీ మండలాధ్యక్షుడు



**గంగవరం, డిసెంబర్ 20, ప్రభాతవార్త :** రాష్ట్రంలో గుంతలు లేని రోడ్లే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం చర్యలు చేపడుతున్నట్లు తెలుగుదేశం పార్టీ మండలాధ్యక్షుడు సోమశేఖర్‌గౌడు పేర్కొన్నారు. మాజీమంత్రి, పలమనేరు ఎమ్మె ల్యే అమరనాథరెడ్డి సహకారంతో శుక్రవారం స్థానిక నాయకులతో కలిసి రోడ్డు పనులకు భూమి పూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మండలా ధ్యక్షుడు మాట్లాడుతూ.. మండలంలోని మేలుమాయి పంచాయతీ చిన్నమ నాయనిపల్లె గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారిని నూతనంగా నిర్మించుటకుగాను బాహ్య సహాయంతో ప్రాజెక్ట్ ద్వారా చేపట్టే ఏషియన్ బ్యాంక్ ద్వారా మంజూరైన రూ.69 లక్షల నిధులతో తారురోడ్డు ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. గత పాలకులు చేసిన పాపాలే నేడు రోడ్ల రూపంలో ప్రజల పాలిట శాపంగా మారాయన్నారు. ప్రతి 5 ఏళ్లకు ఒకసారి రోడ్లను రెన్యువల్ చేస్తారు. అయితే గత ప్రభుత్వంలో రాష్ట్రంలోని రహదారుల అభివృద్ధి కోసం కనీసం సకాలంలో రెన్యువల్ కూడా చేయలేదని ఆయన విమర్శించారు. గత ప్రభుత్వం లక్షల కోట్లు అప్పుల భారం మోపి వెళ్ళిపోతే అధికారం చేపట్టిన కూటమి ప్రభుత్వం ఆ భారం మోస్తూ సంక్షేమం, అభివృద్ధిని రెండు కళ్లలా సమన్వయం చేసుకుంటూ అభివృద్ధిలో ముందుకు దూసుకుపోతుం దన్నారు. గుంతల మయంగా మారిన రహదారి పనులనుఎమ్మెల్యే అమరనాథరెడ్డి చొరవతో వేగవంతంగా పూర్తి చేస్తామన్నారు. తరతరాలుగా గుంతలమయంతో అధ్వానంగా ఉన్న తమ గ్రామానికి తారురోడ్డు మంజూరు కావడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో దేశం నాయకులు వెంకటరమణరెడ్డి, సురేష్‌చౌదరి, శీనప్ప, తిరుమలయ్య, నాగరాజు, రమేష్‌రెడ్డి, సెల్వ, సుబ్రమణ్యం, బాలాజీ, వెంకటరమణ, గంగాధర తదితరులు పాల్గోన్నారు.

# తిరుపతి డివిజన్

## కార్యకర్తలే పార్టీకి శ్రీరామరక్ష : బొజ్జల సుధీర్

**రేణిగుంట,డిసెంబర్20 ప్రభాతవార్త :** తెలుగుదేశం పార్టీకి కార్యకర్తలే శ్రీరామరక్ష అని శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి అన్నారు. రేణిగుంట పట్టణం నందు ఓ ప్రైవేట్ హోటల్‌లో రేణిగుంట మండలం పార్టీ బూత్ కన్వీనర్లు, యూనిట్ ఇన్చార్జులు, క్లస్టర్ ఇంచార్జిలతో ఎమ్మెల్యే సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ కార్యకర్తలు పార్టీకి బలమని వారి వల్లే తెలుగుదేశం పార్టీ నియోజకవర్గంలో విజయ దుందుభి మోగించింది అన్నారు. కార్యకర్తలకు పార్టీలో ఎప్పటికీ అన్యాయం జరగదన్నారు. పార్టీ విజయానికి కృషిచేసిన ప్రతి ఒక్కరికి పేరుపేరునా ధన్యవాదాలు తెలిపారు. పార్టీకి చేస్తున్న సేవలను ఎప్పటికప్పుడు పార్టీ గుర్తిస్తుందన్నారు. కార్యకర్తల సేవలను పార్టీ ఎప్పటికీ విస్మరించదన్నారు. పార్టీలో అంతఃకహాలకు తావివ్వకుండా అందరూ కలిసికట్టుగా ఒకే కుటుంబం మాదిరి ఉండాలన్నారు. సమావేశంలో తిరుపతి పార్లమెంటరీ టిడిపి ఉపాధ్యక్షుడు గాజులమండ్యం క్లస్టర్ ఇంచార్జ్ చెర్లోపల్లి సుబ్రమణ్యరెడ్డి, టిడిపి మండల అధ్యక్షుడు ముని చంద్రారెడ్డి, రేణిగుంట పట్టణ టిడిపి అధ్యక్షుడు మహబూబ్ బాషా, రేణిగుంట క్లస్టర్ ఇంచార్జి టిడిపి సీనియర్ నేత డి. పుష్పనాదం, సీనియర్ నేత కరకంబాడి క్లస్టర్ ఇంచార్జి బాలసుబ్రమణ్యం నాయుడు (బుజ్జి నాయుడు) టిడిపి సీనియర్ నేతలు మునిస్వామి నాయుడు, దేవళ్ల రమణ, ముచ్చేలి భాస్కర్ రెడ్డి, నెల్లూరు సుబ్రహ్మణ్యం, కొరియర్ రవి, కన్నన్ రెడ్డి, బూత్ కన్వీనర్లు, యూనిట్ ఇన్చార్జులు పాల్గొన్నారు.

## తిరుమలలో అక్కినేని అఖిల్



తిరుమల,డిసెంబర్ 20ప్రభాతవార్తప్రతినిధి: సినీనటుడు అక్కినేని నాగార్జున కుమారుడు అక్కినేని అఖిల్ శుక్రవారం ఉదయం తిరుమలలో శ్రీవేంకటేశ్వర స్వామిని దర్శించుకున్నాడు. ఆలయం వెలుపల అఖిల్‌ను చూడటానికి, సెల్ఫీలు తీసుకునేందుకు అభిమానులు ఉత్సాహం చూపారు.

## గ్రామదేవత పుట్టాలమ్మకు...ఎన్‌ఆర్ఐ భక్తుల విరాళం



**వరదయ్యపాళెం,డిసెంబర్ 20ప్రభాతవార్త:** వరదయ్యపాళెం మండలం సంత వేలూరులోని గ్రామదేవత పుట్టాలమ్మను అమెరికా టెక్సాస్‌లో స్థిరపడిన డాక్టర్ అమిత్‌కిశోర్ బృందం దర్శించుకుంది. రోబోటిక్ హార్ట్ సర్జన్ డాక్టర్ అమిత్‌కిశోర్ బృందం అమ్మవారిని దర్శించుకుని ఆలయ నిర్మాణానికి లక్షరూపాయలు విరాళ మిచ్చారు. పుట్టాలమ్మ అంటే తనకెంతో భక్తిభావం అని, భారత్ వచ్చినపుడు ప్రతిసందర్భంలోనూ అమ్మవారిని దర్శించుకోవడం ఆనందంగా ఉందన్నారు. ఆలయ వ్యవస్థాపకుడు,అమెరికా పౌరుడు డాక్టర్ మాయానిచెంచు మున స్వామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు. అమ్మవారి తీర్థప్రసాదాలు అందుకున్నారు.

## భజనమందిరంలో రామనామస్మరణ



**తిరుపతి(రవాణ),డిసెంబర్ 20ప్రభాతవార్త:** పవిత్రమైన ధనుర్మాసంసందర్భంగా పెద్దకాపువీధిలోని రామమందిరంలో ఉదయం వేళ రామనామస్మరణ, గోదా తిరు ప్పావై ప్రవచనాలు సాగుతున్నాయి. శుక్రవారం ఉదయం 5గంటల నుండి 8గంటల వరకు రాయలసీమ రంగస్థలి కళాసంస్థ ఛైర్మన్ గుండాల గోపీనాథరెడ్డి, బాలసుబ్రమణ్యం,జీవన్‌రెడ్డి, వాసుదేవరెడ్డి, తిరుపాలాచారి, మునికృష్ణయ్య, తొండమనాటి సుబ్రమణ్యంరెడ్డి, కెఎన్ రాజు, సోము ఉమాపతి, భజనకళా కారులు వెంకటనారాయణ తదితరులు రామనామంతో తన్మయత్వం పొందుతూన్నారు. దేవుని నామస్మరణతో అందరికీ శుభాలు కలుగుతాయని అన్నారు. అనంతరం చక్కెరపొంగలి ప్రసాద వితరణ చేశారు.

## వడ్డెర కులస్తుల సమస్యలపై మంత్రి సవితకు వినతి

**వి.కోట, డిసెంబర్ 20 ప్రభాతవార్త :** రాష్ట్రంలో ఉన్న వడ్డెర కులస్తుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ రాష్ట్ర మంత్రి సవితకు వడ్డెర సంఘం యువనేత పవన్ కళ్యాణ్ వినతిపత్రం అందించారు. శుక్రవారం ఆయన విజయ వాడలో మంత్రిని కలిశారు. వడ్డెరలను ఎస్టీ జాబితాలో చేర్చాలని, స్వాతంత్ర్య సమరయోధుడు వడ్డే ఓబన్న జయంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహిం చాలని మంత్రిని కోరారు. దీనిపై మంత్రి మాట్లాడుతూ సిఎం చంద్రబాబు నాయుడు దృష్టికి సమస్యలు తీసుకెళ్తామని హామీఇచ్చారు. సంఘనేతలుభానుప్రకాష్, నారాయణ, రాజే ంద్ర పాల్గొన్నారు.

## రెవెన్యూ సదస్సులతో రైతుల సమస్యల పరిష్కారం

**రామకుప్పం, డిసెంబర్ 20 ప్రభాతవార్త :** రైతుల భూసమస్యలను రెవెన్యూ సదస్సుల ద్వారా పరిష్కరించేందుకు ప్రభుత్వం ఆదేశించిందని ఆర్డీఓ శ్రీనివాసులు రాజు పేర్కొన్నారు. శుక్రవారం పెద్దకురబలపల్లిలో జరిగిన రెవెన్యూ సదస్సులో ఆయన పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు, ప్రజలు రీసర్వేకు సంబంధజంచిన సమస్యలను తీసుకువస్తే పరిష్కరించేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. అనంతరం వినతులు స్వీకరించారు. కార్యక్రమంలో తహశీల్దార్ బాబు, నేతలు పాల్గొన్నారు.

## పిల్లలకు ఉచిత హెచ్‌ఎల్‌ఏ పరీక్షలు



**తిరుపతి హెల్త్, డిసెంబర్ 20 ప్రభాతవార్త :** రుయా చిన్నపిల్లల ఆసుపత్రి తలసీమియాకు సంబందించిన పిల్లలకు ఉచిత హెచ్‌ఎల్‌ఏ పరీక్షలు శుక్రవారం నిర్వహించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు నిర్వహించారు. ఇందులో భాగంగా 43 మంది పిల్లలకు మరియు తల్లి తండ్రులకు దవడ పరీక్షలు చేసారు. ఈ నకు సుమారు 100 మంది పిల్లలు, తల్లి తండ్రులు హాజరయ్యారు. ఈ బెంగుళూరుకి చెందిన ప్రముఖ నారాయణ హెల్త్ సిటీ వారి సహకారంతో నిర్వహించారు. నారాయణ హెల్త్ సిటీ నుంచి ప్రముఖ చిన్న పిల్లల వైద్య నిపుణులు డా. సునీల్ బట్ట ( పీడియాట్రిక్ హెమటా లజి )వారిచే పిల్లలకు వైద్య పరీక్షలు చేయడం జరిగింది. ఈ నందు జిల్లా వైద్యాధికారి డా.హరి ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. రుయా సూపరింటెండెంట్ డా.రవి ప్రభు, రుయా చిన్నపిల్లల విభాగాధిపతి డా.మనోహర్, ఆర్‌బిఎస్‌కె ప్రోగ్రాం ఆఫీసర్ డా.పద్మావతి, డిఈఐసి సిబ్బంది పాల్గొన్నారు.

## క్యాట్ ఫలితాలలో 'కౌటిల్య విద్యార్థుల ప్రతిభ'



**తిరుపతి,డిసెంబర్ 20 ప్రభాతవార్త:** జాతీయస్థాయి క్యాట్ (కామన్ అడ్మిషన్ టెస్ట్) ఫలితాలలో తిరుపతి ముత్యాలరెడ్డిపల్లి కూడలిలో నున్న 'కౌటిల్య ఇన్స్టి ట్యూట్'కి చెందిన దాదాపు 10మంది విద్యార్థులు జాతీయస్థాయిలో టాప్ స్కోర్‌లు సాధించారు. వీరిలో మట్టం మోక్షజ్ఞకు 93.38 పెర్సెనైల్ స్కోర్, భవ్యశ్రీనిషిత-92, జి.వంశీయాదవ్-90.93, కె.హారికరాజు-85, శ్రీనిధి-83.7 పెర్సెనైల్ స్కోర్లు సాధించినట్లు తెలిపారు. వీరు తిరుపతి కౌటిల్యలో క్యాట్ కోసం సంవత్సరం పాటు లాంగ్ టర్మ్ కోచింగ్ తీసుకున్నట్లు తెలిపారు. క్యాట్‌లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను కౌటిల్య డైరెక్టర్ శ్రీధర్, ఫ్యాకల్టీ హరి, సీనియర్ మేనేజర్ ఎన్ఎస్ రెడ్డి తదితరులు అభినందించారు. ఈ సందర్భంగా కౌటిల్య శ్రీధర్ మాట్లాడుతూ గత 15 సంవత్సరాలుగా కౌటిల్య కోచింగ్ ద్వారా అనేక వందల మంది విద్యార్థులు జాతీయస్థాయిలో టాపర్లుగా నిలిచి, ప్రముఖ ఐఐఎంలలో సీట్లు సాధించినట్లు తెలిపారు.

## థార్ ప్లాంట్‌లో ఆక్రమణలు తొలగింపు



**తిరుపతిరూరల్,డిసెంబర్ 20 ప్రభాతవార్త:** ఓటేరు గ్రామ పంచాయతీ పరిధిలోని థార్ ప్లాంట్‌లో అక్రమ నిర్మాణాలను రెవెన్యూ సిబ్బంది, పోలీసు బందోబస్త్ సాయంతో తొలగించారు. తిరుపతిరూరల్ మండల పరిధిలోని ఓటేరు గ్రామ పంచాయతీ పరిధిలోని వినాయకనగర్‌లో నిర్మించిన అక్రమ నిర్మాణాలను శనివారం తెల్లవారు ఝామున పోలీసు బందోబస్త్ సహకారంతో రెవెన్యూ సిబ్బంది తొలగించారు. తిరుపతిరూరల్ మండలంలో ప్రభుత్వ భూములు జోలికోస్తే చర్యలు తప్పవని తహశీల్దార్ రామాంజుల నాయక్ హెచ్చరించారు.

## 23 నుండి భక్త సమ్మేళన వేడుకలు



**తిరుపతి హెల్త్, డిసెంబర్ 20 ప్రభాతవార్త:** ఈనెల 23 నుండి 25వ తేదీ వరకు స్థానిక తిరుచానూరు రోడ్డులోని టిటిడి శ్రీనివాస కళ్యాణ మండపాలలో ఘనంగా 6వ భక్త సమ్మేళన వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఇస్కాన్ వద్దనున్న రామకృష్ణ మఠం నిర్వాహకులు స్వామిసుకృతానంద తెలియజేశారు. అదేవిధంగా ఈనెల22వతేదీశారదామాత172వజయంతినిర్యాలీగాతమమఠంనుండికేటిరోడ్డునందునిర్వహిస్తామన్నారు.

## అన్నదమ్ముళ్ళ మధ్య ఘర్షణ-అన్న మృతి

**తొట్టంబేడు, డిసెంబర్ 20 ప్రభాతవార్త :** మండలంలోని బోనుపల్లి గ్రామంలో ఓ వ్యక్తి మృతిచెందిన సంఘటన చోటుచేసుకుంది. గ్రామంలో నివాసం ఉంటున్న ఆదెమ్మకు నలుగురు కుమారులు. వీరిలో పెద్దకుమారుడు టి.సుబ్రమణ్యం (55)కు అన్నదమ్ముళ్ళ మధ్య వివాదాలు జరిగేవి. దీంతో కాలేకడుపుతోనే అప్పుడప్పుడు బాలాజీ ఉండడంతో శుక్రవారం మధ్యాహ్నం రోడ్డుపైనే పడిపోవ డంతో గుర్తించిన గ్రామస్తులు కుటుంబసభ్యులకు అందించారు. పెదనాన్న వద్ద ఉంటూ జీవనం సాగిస్తున్న సుబ్రమణ్యం మృతి తీరని లోటని పలువురు గ్రామస్తులు తెలిపారు. సమాచారం అందుకున్న ఎస్ఐ ఈశ్వరయ్య ఏరియా ఆస్పత్రికి చేరుకుని సమాచారం సేకరించి కేసునమోదుచేశారు.

# గూడూరు డివిజన్

## పార్టీలకతీతంగా గ్రామాల అభివృద్ధికి తోడ్పడుతాం:ఎమ్మెల్యే




చిల్లకూరు, డిసెంబర్ 20 ప్రభాతవార్త : చిల్లకూరు మండలం గ్రామాల అభివృద్ధి చెందాలంటే ఒక తెలుగుదేశం పార్టీకి సాధ్యమని గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ అన్నారు. శుక్రవారం మండలంలోని చింతారం గ్రామంలో ఏర్పాటు చేసిన రెవెన్యూ సదస్సులో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అనంతరం ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ మాట్లాడుతూ గ్రామాల్లో అభివృద్ధి చేసింది తెలుగుదేశం పార్టీని పేదలకు పనిచేసే వారిని గెలిపించుకోవాలన్నారు. చింతవరం గ్రామంలో 112 ఎకరాల పేదల భూములను భూపోస్వాములు ఆక్రమించుకొని ఉన్నారని వాటి అన్నిటిని పేదలకు ఇవ్వడం జరుగుతుందని మీ భూముల్లోకి మీరు వెళ్లి సాగు చేసుకోవాలన్నారు మీకు ఎలాంటి ఇబ్బందులు జరిగిన మీ వెనక పార్టీ అండదండలు ఉంటాయన్నారు. ఈ రెవెన్యూ సదస్సు వల్ల భూ సమస్య పరిష్కరించేందుకే ప్రవేశపెట్టడం జరిగిందన్నారు. పేదల వెంట నేనుంటా అంటూ భరోసా ఇవ్వడం జరిగింది. అనంతరం ప్రజల నుండి వచ్చిన అర్జీలను సేకరించి వారి సమస్యలు పరిష్కరించేందుకు చొరవ తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ శ్రీనివాసులు, మండల పార్టీ అధ్యక్షులు ఊచ్చూరు వెంకటేశ్వరరెడ్డి, పార్టీ సీనియర్ నాయకులు సన్నారెడ్డి వెంకటరమణారెడ్డి, రాష్ట్ర మహిళా కార్యదర్శి గుండా లీలావతి, పార్టీ నాయకులు పూడిపర్తి ప్రవీణ్ కుమార్‌రెడ్డి, పచ్చ వెంకటేశ్వర నాయుడు, ఎదనపత్తి భాస్కర్ రెడ్డి, పసల వెంకటేశ్వర్లు, మూగ శంకరయ్య, కోట సతీష్, మేఘనూరు వెంకట కృష్ణయ్య, కుమార్, సాయి బాబా, దువ్వూరు వినయ్ రెడ్డి, మేకల కుమారు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## విద్యార్థుల హృదయాల్లో డాక్టర్ ఐ.గోపాల్‌రెడ్డి

**- ఎన్‌బికెఆర్ డైరెక్టర్ డాక్టర్ వి.విజయకుమార్‌రెడ్డి**



కోట, డిసెంబర్ 20 ప్రభాతవార్త: ఇంజినీరింగ్ విద్యార్థుల హృదయాల్లో జెఎన్ టియు మాజీ వైస్ ఛాన్స్ లర్ దివంగత డాక్టర్ ఐ.గోపాల్‌రెడ్డి చెరగని ముద్ర వేసుకున్నారని ఎన్‌బికెఆర్ ఐఎస్‌టి డైరెక్టర్ డాక్టర్ వి.విజయకుమార్‌రెడ్డి అన్నారు. శుక్రవారం కోట మండలం విద్యానగర్‌లోని ఎన్‌బికెఆర్ ఐఎస్‌టిలో డాక్టర్ ఐ.గోపాల్‌రెడ్డి జయంతిని ఘనంగా నిర్వహించారు. ముందుగా కళాశాల డైరెక్టర్ డాక్టర్ వి.విజయ కుమార్ రెడ్డి, అధ్యాపకులు ఆయన కాంస్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1979లో నాడు నేదురుమల్లి జనార్ధన్‌రెడ్డి, డాక్టర్ ఐ.గోపాల్‌రెడ్డిని కళాశాలకు తొలి ప్రిన్సిపాల్‌గా నియమించారని చెప్పారు. అనంతరం ఐ.గోపాల్‌రెడ్డి డైరెక్టర్‌గా, కళాశాల ఛైర్మన్‌గా వివిధ హోదాలలో పనిచేసి కళాశాలను ప్రగతి పథంలో నడిపించారని పేర్కొన్నారు. ఆయన ఆధ్వర్యంలో చదువుకున్న విద్యార్థులు నేడు ప్రపంచ వ్యాప్తంగా వివిధ రంగాల్లో స్థిరపడ్డారని చెప్పారు. క్రమశిక్షణతో కళాశాలను మూడున్నర దశాబ్దాల పాటు దిగ్విజయంగా ముందుకు నడిపించారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ విభాగాధిపతులు, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

## సిమెంటు దిన్నెల తొలగింపునకు శ్రీకారం



సూళ్లూరుపేట, డిసెంబర్ 20 ప్రభాతవార్త : సూళ్లూరుపేట పట్టణ నడిబొడ్డులో గత మూడేళ్లుగా ట్రాఫిక్‌కు నిరంతరం అంతరాయం కలిగిస్తూ ప్రజలను అవస్థ లకు గురిచేస్తున్న పాత రైల్వేక్యాబిన్ వద్ద ఉన్న రైల్వే అండర్ బ్రిడ్జి సిమెంటు దిన్నెలను పక్కకు జరిపే ప్రక్రియ ప్రారంభమైంది. ఇందులో భాగంగా ఈ నెల 22వ తేదీన ఈ దిన్నెలను తూర్పువైపు సుమారు ఆరు అడుగులు జరిపేందుకు సదరన్ రైల్వే ఉన్నతాధికారులు చర్యలు చేపడుతున్నారు. ఈ విషయమై స్థానికంగా ఉన్న రైల్వే అధికారులకు ఉత్తర్వులు అందాయి. ఆదివారం భారీ క్రేన్ల సాయంతో ఈ దిన్నెలను పక్కకు జరుపుతారని తెలిసింది. దీంతో రైల్వేగేటు వద్ద ట్రాఫిక్ అంతరాయాన్ని కొంతమేరకు వెసులుబాటు కలుగుతుంది.

## ట్రాఫిక్ మళ్లింపునకు సహకరించండి : సిఐ

సూళ్లూరుపేట, డిసెంబర్ 20 ప్రభాతవార్త : సూళ్లూరుపేట పట్టణంలో ట్రాఫిక్ నియంత్రణలో భాగంగా శ్రీసిటీ, అపాచి, వివిధ కంపెనీల నుంచి వచ్చే కార్మికుల బస్సులను చెంగాళమ్మ బ్రిడ్జి నుంచి కాకుండా జాతీయ రహదారిపై హోలీక్రాస్ జంక్షన్ మీదుగా పట్టణంలోకి రావాలని సిఐ మురళీకృష్ణ సూచించారు. ఇందుకు సంబంధించి శుక్రవారం ఆయన వివిధ కంపెనీల ప్రతినిధులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. వందలాది కంపెనీల బస్సులతో పట్టణంలో నిరంతరం ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతుందని, అలాగే శిథిలావస్థలో ఉన్న చెంగాళమ్మ గుడి వద్ద వంతెనను దృష్టిలో ఉంచుకొని సహకరించాలని ఆయన కోరారు. ఈ నెల 23వ తేదీ నుంచి ఈప్రక్రియ పదిరోజుల పాటు నిర్వహించేందుకు నిర్ణయించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సూళ్లూరుపేట, తడ ఎస్ఐలు బ్రహ్మనాయుడు, కొండప్ప నాయుడు, శ్రీసిటీ సెక్యూరిటీ ఆఫీసర్ రమేష్, శ్రీసిటీ సిఐ, బస్సు ఆపరేటర్లు పాల్గొన్నారు.

## త్రీమెన్ కమిటీలు... మరో ఆరు నెలల పొడిగింపు

కోట,డిసెంబర్ 20 ప్రభాతవార్త : ప్రాథమిక సహకార సంఘాల్లో ప్రస్తుతం ఉన్న అధికారుల కమిటీలను మరో ఆరు మాసాలు పొడిగిస్తూ ఆశాఖ ముఖ్య కార్యదర్శి రాజశేఖర్ ఉత్తర్వులిచ్చారు. వైకాపా ప్రభుత్వ హయాంలో నియమించిన త్రీమెన్ కమిటీలను కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత రద్దు చేశారు. ఆ స్థానంలో అధికారులతో కూడిన త్రీమేన్ కమిటిలు అన్ని చోట్లా బాధ్యతలు చేపట్టాయి. వీటి గడువు శుక్రవారంతో ముగిసింది. ఈ నేపథ్యంలో ప్రజా ప్రతినిధుల సిఫార్సులతో త్రీమేన్ కమిటిలు నియమిస్తారని తెదేపా నాయకులు ఆమేరకు శాసన సభ్యులు తమ పేర్లను కూడా పరిశీలించాలని కోరారు. ఇంతలో సదరు కమిటీల కొనసాగింపు ఉత్తర్వులు వెలువడ్డాయిని అధికార వర్గాలు తెలిపాయి.

## రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలు

నాయుడుపేట,డిసెంబరు 20 ప్రభాతవార్త; నాయుడుపేట మండలంలోని చలివేంద్ర వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు తీవ్రంగా గాయపడ్డారు. సేకరించిన సమాచ్చారం మెరకు వివరాలిలా ఉన్నాయి. నాయుడుపేటకు చెందిన రమణయ్య,రవిబాబులు మోటార్‌సైకిల్‌పై మేనకూరు సమీపంలో ఉన్న కంపెనికి వెళ్లి డ్యూటి ముగించుకొని తిరిగి నాయుడుపేటకు వస్తుండగా మార్గమధ్యలో చలివేంద్ర వద్దకు వచ్చేసరికి ఎదురుగా వస్తున్న లారీని తప్పించబోయి ప్రమాదవశాత్తు మోటార్‌సైకిల్ అదుపుతప్పి బోల్తాపడింది.దీంతో మోటార్‌సైకిల్‌పై ప్రయాణిస్తున్న రమణయ్య,రవిబాబుకు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు గుర్తించి క్షతగాత్రులను 108సహాయంతో చికిత్స నిమిత్తం నాయుడుపేట ప్రభుత్వవైద్యశాలకు తరలించారు. నాయుడుపేట పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

## సిఎం రిలీఫ్ ఫండ్‌ను అందజేసిన ఎమ్మెల్యే



గూడూరు, డిసెంబర్ 20 ప్రభాతవార్త : 2024 ఎన్నికల్లో చింతవరం గ్రామంలో వైసిపి మూకల దాడిలో గాయపడి చికిత్స పొంది ఇంటి దగ్గర విశ్రాంతి తీసు కుంటున్న పార్టీ కార్యకర్త జాలారి గోపాల్‌కి ముఖ్యమంత్రి సహాయనిది నుండి మంజూరు అయిన 5 లక్షల 49 వేల రూపాయలు చెక్కును గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ శుక్రవారం అందించారు. చింతవరం గ్రామంలోని గోపాల్ నివాసానికి చేరుకుని పరామర్శించి అనంతరం చెక్కును అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు వెంకటేశ్వర్లు రెడ్డి రాష్ట్ర మహిళా కార్యదర్శి గుండాల లీలావతి, నాయకులు పసల వెంకటేశ్వర్లు, కుమారి, సాయి బాబా, ఎస్సై సురేష్ బాబు, మండల నాయకులు పాల్గొన్నారు.

## మృతి చెందిన కుటుంబాలకు ఆర్థిక సహాయం



చిల్లకూరు, డిసెంబర్ 20 ప్రభాతవార్త : ఇటీవల చిట్టమూరు మండలం రంగనాథపురం గ్రామం నందు వరద నీటిలో ప్రమాదవ శాత్తు కొట్టుకుపోయిన ఎండి షారుక్, వేణుంబాక మధుసూదన్‌రెడ్డి కుటుంబాలకు ప్రభుత్వం అందించిన 8లక్షల రూపాయలను శుక్రవారం గాంధీ నగర్‌లోని రెవెన్యూ సదస్సులో సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీన, ఎమ్మెల్యే సునీల్ కుమార్‌తో కలసి మృతి చెందిన కుటుంబాలకు ఆర్థిక సహాయ చెక్కులను అందజేసారు.

## అమిత్‌షాను కేబినెట్ నుండి బహిష్కరించాలి

**- సీపీఐ, డీహెచ్పీఎస్, ఇన్సాఫ్, ఏఐఎస్ఎఫ్ నాయకుల డిమాండ్**



గూడూరు, డిసెంబర్ 20 ప్రభాతవార్త : భారతదేశ రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ పై అవమానకర వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షాను మంత్రివర్గం నుండి బర్తరఫ్ చేయాలని సీపీఐ, డీహెచ్పీఎస్, ఇన్సాఫ్, ఏఐఎస్ఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం గూడూరు కటకరాజా వీధిలోని సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీపీఐ గూడూరు నియోజకవర్గ కార్యదర్శి జీ.శశి కుమార్,డీహెచ్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు ఎంబేటి చంద్రయ్య మాట్లాడారు. ఈ విషయమై ప్రశాతంగా నిరసన తెలుపుతున్న కాంగ్రెస్ ఎంపీలపై బీజేపీ ఎంపీలు దాడికి దిగి దౌర్జన్యానికి పాల్పడడం పాలకపక్ష నేతల దిగజారుడు రాజకీయాలకు అద్దం పడుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో ఇన్సాఫ్ రాష్ట్ర ఉప కార్యదర్శి షేక్ జమాలుల్లా, ఏఐఎస్ఎఫ్ నియోజకవర్గ కార్యదర్శి యశ్వంత్, సన్నీ, దీపు తదితరులు పాల్గొన్నారు.

## సత్వరమే భూ సమస్యలు పరిష్కారం తహశీల్దార్




బాలాయపల్లి, డిసెంబర్ 20 ప్రభాతవార్త : రెవెన్యూ సదస్సులో సత్వరమే భూ సమస్యలను పరిష్కరిస్తామని తహశీల్దార్ శ్రీనివాసులు తెలిపారు. మండలం సిద్దగుంట గ్రామ పంచాయతి కార్యాలయంలో రెవెన్యూ గ్రామసదస్సు జరిగింది. రైతుల నుంచి భూ సమస్యలపై అర్జీదారుల నుంచి తహశీల్దార్ వినతులు తీసుకున్నారు. శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానాన్ని ఎండోమెంట్ దేవస్థానంగా విలీనం చేసుకోవాలని కొంతమంది గ్రామస్తులు కోరారు. సమస్యలు తెలుసుకుని పరిష్కరించేందుకే ప్రభుత్వం నేరుగా గ్రామాల్లోనే రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సిద్దగుంట గ్రామంలో లో ఉన్న మేత పోరంబోకు భూమిని బంగారు పేటకు చెందిన కొంతమంది ఆక్రమించుకున్నారని గ్రామస్థులు ఫిర్యాదు చేశారు. భూ అక్రమాలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ రెవెన్యూ సదస్సులో వీఆర్వో శ్రీనివాసులు రెడ్డి, సర్పంచ్ కే.రత్నమ్మ, ఏ.ఎస్.ఓ. వసుంధర, మాజీ సర్పంచ్ కే.రాజారెడ్డి, ఈ.ఓ.పి.ఆర్.డి. మోహన రాజు తదితరులు పాల్గొన్నారు.

## పన్ను వసూళ్ళకు కమిషనర్ పరుగులు:



శ్రీకాళహస్తి,డిసెంబర్ 20 ప్రభాతవార్త : శ్రీకాళహస్తి మున్సిపల్ పరిధిలోని పన్నుల వసూళ్ళకు పొద్దుపొడవగానే కమిషనర్ పరుగులు తీస్తూ తన సిబ్బందిని పరుగులు తీయిస్తున్నారు. ముఖ్యంగా నాలుగుమాడావీధుల్లో పన్నుల వసూళ్ళకు కమిషనర్ బియస్ గిరికుమార్ స్వతహాగా పర్యవేక్షిస్తున్నారు. శుక్రకవారం ఉదయమే ఆయన తేరువీధి, నగరి వీధుల్లో వ్యక్తిగతంగా పర్యవేక్షించారు. డిమాండ్ ప్రైవేటు ఆస్తుల నుంచి రూ.7.5కోట్లు అరియర్స్ 2.3కోట్లు ఈ ఏడాది రూ.9.8కోట్లు వసూలు చేయాల్సి ఉంది.ఇప్పటి వరకు ఆరియర్స్‌లో రూ.14 లక్షలు, కరెంటు వసూళ్ళు రూ.4.3 కోట్లు వసూలు చేసినట్లు కమిషనర్ గిరికుమార్ తెలిపారు. ఇప్పటి వరకు 45శాతం పన్నులు వసూళ్ళు చేసామని, డిసెంబర్ చివరి వరకు పన్నుల వసూళ్ళకు సంబంధించి ఉన్నతాధికారులు వత్తిడి తెస్తున్నారని కాబట్టి తానే స్వయంగా పర్యవేక్షిస్తున్నట్లు కమిషనర్ వివరించారు. పట్టణాభివృద్ధికి ప్రజలు సకాలంలో పన్నులు వసూలు చేయాల్సి ఉందన్నారు. దేవస్థానం కార్‌పార్కింగ్‌లో ఇవ్వాల్సిన వాటాకు సంబంధించి స్థానిక శాసన సభ్యుల ద్వారా ప్రతిపాదించామని వివరించారు. కమిషనర్‌తో పాటు రెవెన్యూ ఆఫీసర్ ఖాజామొహిద్దీన్, బిల్‌కలెక్టర్లు హరికృష్ణయ్య, మల్లికార్జున్, బాలాజి, శరత్, పెరుమాళ్ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## టిడిపి శాశ్వత సభ్యత్వం తీసుకున్న పల్లినేని

**-జీవిత కాలం పార్టీకి రుణపడి వుంటాను..!**




చంద్రగిరి, డిశంబర్ 20 ప్రభాతవార్త: తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు పల్లినేని సుబ్రమణ్యం నాయుడు పార్టీ సభ్యత్వ నమోదులో లక్ష రూపాయలు చెల్లించి జీవితకాల సభ్యత్వం తీసుకున్నారు. టిడిపి కార్యకర్త స్థాయి నుండి అంచెలంచెలుగా ఎదిగిన ఆయన సేవలకు గుర్తుగా 2013లో పనపాకం పంచాయతీ సర్పంచ్‌గా తన సతీమణి పల్లినేని మునిలక్ష్మిని ఎన్నుకున్నారు. అదేవిధంగా పార్టీకి ఆయన చేసిన సేవలకు 2013లో ఐతేపల్లి సింగిల్‌విండో ఛైర్మన్‌గా అవకాశం కల్పించారు. 5ఏళ్ళ పాటు పనిచేసిన ఆయనను 2016లో మరోమారు పార్టీ అధిష్టానం టిడిపి మండల అధ్యక్షుడుగా నియమించడంతో గత 8ఏళ్ళుగా పార్టీ బలోపేతానికి ఎనలేని సేవలందిస్తున్నారు. ముఖ్య ంగా పాతికేళ్ళ టిడిపి ఓటమిని చెరిపేవే యడంలో, తెలుగుదేశం ఎంఎల్ఏ అభ్యర్థి, ప్రస్తుత ఎంఎల్ఏ పులివర్తి నాని విజయం కోసం శ్రమించి విజయం సాధించారు. ఈ నేపథ్యంలో జీవితకాల సభ్యత్వం తీసుకున్న ఆయన మాట్లాడుతూ పార్టీ తనకు ఎంతో చేసిందనీ, ప్రాణం వున్నంత వరకు టిడిపిలోనే కొనసాగుతూపార్టీ పురోభివృద్ధికై సేవలం దిస్తూ వుంటానని అన్నారు. ఎంఎల్ఏ అడుగుజాడల్లో నడుస్తూ, ప్రజలకు మెరుగైన సేవలందించనున్నట్లు తెలిపారు.

## వెంకన్న అభిషేకసేవలో... సిఎస్ నీరబ్‌కుమార్



తిరుమల,డిసెంబర్ 20ప్రభాతవార్తప్రతినిధి: రాష్ట్రప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్‌ప్రసాద్ కుటుంబంతో కలసి శుక్రవారం వేకువజామున వేంకటేశ్వర స్వామి అభిషేకసేవలోపాల్గొన్నారు. ఆలయం మహద్వారం వద్ద టిటిడి అదనపు ఈఓ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి స్వాగతం పలికి శ్రీవారి దర్శనం చేయించారు. తీర్థప్రసాదాలు అందజేశారు.

## కుటుంబ కలహాలంతో ఒకరు మృతి!

నాయుడుపేట,డిసెంబరు 20 ప్రభాతవార్త; నాయుడుపేట పట్టణంలోని అమరాగార్డెన్‌లో నివాసం ఉంటున్న చిరంజీవి (45)కుటుంబ కలహాలు కారణంగా ఆత్మహత్య చేసుకొని శుక్రవారం మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. పోలీసుల సమాచారం మెరకు వివరాలిలా ఉన్నాయి.నాయుడుపేట పట్టణంలోని అమరాగార్డెన్‌లో నివాసం ఉంటున్న చిరంజీవి గతకొంత కాలం నుండి మద్యం సేవించి మత్తులో కుటుంబ సభ్యులతో ఘర్షణకు దిగేవాడు, అయితే ఆకుటుంబంలో ఏమి జరిగిందో ఏమో తెలియదుగానీ ఇంట్లో ఎవరులేని సమయంలో ఫ్యాన్‌కు ఉరివేసుకొని చిరంజీవి ఆత మ్రహత్యకు పాల్పడినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. విషయం తెలుసుకొన్న నాయుడుపేట సిఐ బాబి తన సిబ్బందితో కలిసి అక్కడకు చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు.అనంతరం చిరంజీవి మృతదేహాన్ని పంచనామనిమిత్తం నాయుడుపేట ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మృతుడుకి భార్య,ఇద్దరు పిల్లలు ఉన్నట్లు తెలిసింది. నాయుడుపేట సిఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## కార్గో సేవలు సద్వినియోగం చేసుకోవాలి : కలెక్టర్




తిరుపతి కలెక్టరేట్, డిసెంబర్ 20 ప్రభాతవార్త: తిరుపతి జిల్లాలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ వారు ప్రజలకు మరింత చేరువగా కార్గో సేవలను అందించుటకు డోర్ డెలివరీ సౌకర్యాన్ని అందుబాటులోకి తెచ్చిందని, ప్రజలు ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ డా.ఎస్ వెంకటేశ్వర్ పేర్కొ న్నారు. శుక్రవారం మధ్యాహ్నం స్థానిక జిల్లా కలెక్టర్ ఛాంబర్ నందు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ వారు ప్రవేశపెట్టిన డోర్ డెలివరీ సౌకర్యానికి సంబంధించిన బ్యానర్‌ను, కరపత్రాలను జిల్లా కలెక్టర్ సంబంధిత అధికారు లతో కలిసి విడుదల చేశారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఎ.పి.ఎస్.ఆర్.టి.సి. ప్రజలకు మరింత చేరువగా కార్గో సేవలను అందించుటకు డోర్ డెలివరి సౌకర్యాన్ని రాష్ట్రవ్యాప్తంగా అమలు చేస్తూ తిరుపతి జిల్లాలోని పలు ప్రదేశాల్లో అందుబాటులోకి తెచ్చిందని తెలిపారు. 50 కేజీల బరువు వరకు బుకింగ్ చేసిన "డోర్ డెలివరి" పార్సిల్ కొరియర్లను వినియోగదారుని ఇంటి వద్దకు నేరుగా చేర్చబడుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో తిరుపతి డిపో మేనేజర్ బాలాజీ, బస్ స్టేషన్ మేనేజర్ డిఆర్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## కుప్పానికి నిధుల వరద

**- అభివృద్ధి కార్యక్రమాలకు 'కడ'కు ప్రభుత్వంచే 456 కోట్లు మంజూరు !!**

**- కుప్పంలో అండర్ గ్రౌండ్ డ్రైన్లకు 155 కోట్లు.. నీటి సరఫరాకు 140 కోట్లు !!**

కుప్పం, డిసెంబర్ 20 ప్రభాతవార్త: సిఎం చంద్రబాబునాయుడు ప్రాతినిధ్యం వహిస్తున్న కుప్పం నియోజకవర్గానికి నిధుల వరద మొదలైంది. కుప్పం ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ (కడ) పరిధిలో 11 పనులు చేపట్టేందుకు గాను రాష్ట్ర ప్రభుత్వంద్వారా రూ 456కోట్ల రూపాయల నిధులను మంజూరు చేస్తూ రా ష్ట్ర ప్రణాళిక శాఖ పాలనాపరమైన అనుమతులు ఇస్తూ జిఓఆర్‌టినెం 120ను జారీ చేసింది. ఈనిధుల్లో భాగంగా 451కోట్లను 11 అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టేందుకు మరో 5 కోట్లు ప్రైవేట్ కన్సల్టెన్సీలతో సంప్రదింపులు, కడ కార్యాలయం ఎస్టాబ్లిష్‌మెంట్‌కు ఖర్చు చేయనున్నారు. కుప్పంలో అండర్ గ్రౌండ్ డ్రైన్లు, పరిశ్రమలకు నీటి సరఫరాకై 155 కోట్లు, యామనూరు రిజర్వాయర్ నుంచి కుప్పం మున్సిపాలిటీకి నీటి సరఫరా కోసం అభివృద్ధి పనులకు 140కోట్లు మంజూరు చేశారు. అలాగే కుప్పంలో 25వార్డుల్లో సిసి డ్రైన్ల నిర్మాణాలకు 19.50కోట్లు, కుప్పం పట్టణ సుందరీకరణకోసం మరో 10కోట్లు మంజూరు చేశారు. అలాగే స్టోమ్ డ్రైన్ల నిర్మాణంకోసం 30 కోట్లు, స్మశాన వాటికలో బర్నింగ్ యూనిట్‌కు 3కోట్లు, మున్సిపాలిటీలో వీధిదీపాల ఏర్పాటుకు 3కోట్లు, కుప్పం డికెపల్లి చెరువుపార్కు, కుప్పం బస్టాండ్‌లోని రాజావారి పార్కుల అభివృద్ధికి 29 కోట్లు మంజూరు చేశారు. అలాగే కుప్పంలోని కార్యాలయాల సముదాయంలో కమాండ్ కంట్రోల్‌రూం, అధికారుల అతిథిగృహాలకు 10కోట్లు, కుప్పం ఎన్టీఆర్ స్టేడియం అభివృద్ధికి 22కోట్లు, కుప్పం మున్సిపాలిటీలో 25వార్డుల్లో సిసి, బిటి రోడ్ల నిర్మాణాలకు మరో 29.50కోట్ల నిధులను ప్రణాళిక శాఖ మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

## విద్యార్థులలో సృజనాత్మకతను వెలికితీత



చిల్లకూరు, డిసెంబర్ 20 ప్రభాతవార్త : విద్యార్థులలో దాగి ఉన్న సృజనాత్మ కతను వెలికితీసేందుకు మండల కేంద్రమైన చిల్లకూరులో ఉన్న లిటిల్ ఏంజల్స్ పబ్లిక్ స్కూల్ నందు 1వ తరగతి నుండి 8వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థినీ, విద్యార్థులకు సైన్స్, సోషల్ పాఠ్యాంశాలకు సంబంధించి శుక్రవారం ఎక్స్‌పో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినీ, విద్యార్థులు వారి పాఠ్యాంశాలకు సంబంధించి వివిధ అంశాలను బొమ్మల రూపంలో రూపొందించారు. ఈ నమూనా ఎంతగానో ఆకట్టుకుంది. దీంతో ఉపాధ్యాయుల బృందం విద్యార్థి రూపొందించిన నమూనాను చూసి అభినందించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## గూడూరు-వెంకటగిరి రోడ్డును బాగుచేయని ప్రభుత్వాలు

**- కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి**



వెంకటగిరి, డిసెంబర్ 20 ప్రభాతవార్త : వెంకటగిరి గూడూరు రోడ్డు అధ్వానంగా ఉన్న కూటమి ప్రభుత్వం పట్టించుకోలేదని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పంట శ్రీనివాసులు రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన వెంకటగిరిలో విలేకరుల సమావేశం నిర్వహించారు. గత వైసిపి ప్రభుత్వం ఈ రోడ్డును పట్టించుకోలేదని విమర్శించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడు నెలలైనా బాగు చేయించలేదని తెలిపారు. ప్రముఖ పుణ్యక్షేత్రమైన తిరుపతికి వెళ్లాలంటే ఈ మార్గంలోనే వెళ్లాలని తెలిపారు. ఎన్నో సంవత్సరాల నుండి గూడూరు వెంకటగిరి మార్గం అధ్వానంగా ఉందని చెప్పారు. ఈ రోడ్డును ప్రభుత్వం బాగు చేయించకపోతే ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

## అంగన్వాడి సిబ్బందికి ఉచిత కంటి వైద్య శిబిరం : సిడిపిఓ



వెంకటగిరి, డిసెంబర్ 20 ప్రభాతవార్త : వెంకటగిరి ప్రాంతంలోని అంగన్వాడి సిబ్బందికి శ్రీనివాస సేవా ట్రస్ట్ వారు ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించినట్లు సిడిపిఓ శంషాద్ బేగం తెలిపారు. 204 మంది ఆయాలకు ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. కంటి ఆపరేషన్లు అవసరమైన వారికి అరవింద నేత్రాలయకం పంపుతామని తెలిపారు. సూపర్వైజర్లు మహిత, పోలమ్మ, కల్పలత పరిమళ, తదితరులు పాల్గొన్నారు.

## ఈనెల 26నాటికి గృహాలు పూర్తి చేయడమే లక్ష్యం : హౌసింగ్ పీడీ



వెంకటగిరి, డిసెంబర్ 20 ప్రభాతవార్త : ఈనెల 26వ తేదీ నాటికి ఏడువేల గృహాలను జిల్లాలో పూర్తి చేయడమే లక్ష్యమని జిల్లా హౌసింగ్ ప్రాజెక్ట్ డైరెక్టర్ కె శ్రీనివాసరావు తెలిపారు. వెంకటగిరి మండల పరిషత్ కార్యాలయంలో హౌసింగ్ సిబ్బందితో ఆయన సమావేశం నిర్వహించారు. లబ్ధిదారుల చేత ఇల్లు ఎందుకు కట్టించలేకపోతున్నారు సమస్యలు తెలపాలని ఆయన సిబ్బందిని కోరారు. ఈనెల 26వ తేదీ నాటికి గృహాల నిర్మాణ పనులు పూర్తి చేయించాలని తెలిపారు. అలసత్వం వహించే సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పట్టణంలోని జగనన్న లేఅవుట్, గ్రామాల్లో జరుగుతున్న గృహాల పనులపై సమీక్షించారు. సమావేశంలో ఎంపీడీవో కె.వి కోటేశ్వరరావు, హౌసింగ్ డీ ఈ దశయ్య, ఏఈ ఎం రాజా, తదితరులు పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ కోత

వెంకటగిరి, డిసెంబర్ 20 ప్రభాతవార్త : పట్టణంలోని 132 కెవి సబ్ స్టేషన్‌లో శనివారం మరమ్మత్తుల కారణంగా ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు వెంకటగిరి టౌన్, వెంకటగిరి రూరల్, డక్కిలి, బాలాయపల్లి మండలాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు వెంకటగిరి విద్యుత్ శాఖ డీ ఈ ఈ ముని రవిచంద్ర ప్రకటనలో తెలిపారు.

## ఫోక్సో కేసులో పది సంవత్సరాలు జైలు

బాలాయపల్లి, డిసెంబర్ 20 ప్రభాతవార్త: మండలంలోని జయంపు గ్రామం పరిధిలోని జరిగిన పోక్సో కేసులో ముద్దాయిలకి పది సంవత్సరాలు జైలు శిక్ష, 22,000 జరిమానా ఫోక్సో కోర్టు విధించింది. ఫిర్యాది దాసరి చలపతి పెద్ద కుమార్తె జయంపు హై స్కూల్ నందు 10వ తరగతి చదువుతూ వుండిన సమయంలో, ఓజిలి మండలం ఇనుగుంట గ్రామం చెందిన దండోలు సుబ్బరావు జయంపు గ్రామంలో పురుగు మందుల అంగడిలో పనిచేసి ఫిర్యాది పెద్దకుమార్తెకు మాయమాటలు చెప్పి, పెళ్లి చేసుకుంటాను అని చెప్పి కిడ్నాప్ చేసి తీసుకొని వెళ్ళి ఆమెపై అత్యాచార యత్నానికి పాల్పడ్డాడు. అందుకు సహకరించిన ముద్దాయిలకి జైలు శిక్ష జరిమానా విధించారు. జైలు శిక్ష జరిమానా కొగిలి సుబ్రమణ్యం, యల్లంటి వెంకటయ్య, మంగులూరు వాణిలకు జిల్లా పోక్సో కోర్టు జడ్జి సిరిపిరెడ్డి సుమ విచారణ పూర్తి చేసి నేడు ప్రతి ముద్దాయికి 10 సంవత్సరాలు జైలు శిక్ష, ఇరవైరెండు వెలు జరిమానా విధించారు. జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు నేతృత్వంలో సీఐ ఏవి రమణ, ఎస్ఐ గోపిలో కోర్టుకు సరైన సాక్షాలు సమర్పించి నిందితులకు జైలు శిక్ష పడే విధంగా చేశారు.

## సదస్సును సద్వినియోగం చేసుకోండి



వాకాడు, డిసెంబర్ 20 ప్రభాతవార్త: ప్రభుత్వం ప్రవేశపెట్టిన రెవెన్యూ సదస్సులో భూ సమస్యలు మీద రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహశీసిల్దార్ రామయ్య అన్నారు. శుక్రవారం వాకాడు మండలం కొండాపురం లోని రైతు భరోసా కేంద్రంలో రెవెన్యూ సదస్సు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన టిడిపి సీనియర్ నాయకుడు తుమ్మల మోహన్ నాయుడు పాల్గొన్నారు. మోహన్‌నాయుడు మాట్లాడుతూ పంచాయతీ లోని గ్రామాలలో నెలకొన్న భూ సమస్యలు ఉన్నాయని, ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి అధికారులు రైతులకు న్యాయం చేయాలన్నారు, ముఖ్యంగా దారి సమస్యలు ఎన్నో ఏళ్లగా ఉందని పరిష్కరించాలని అధికారులు కోరారు. ఈ రెవెన్యూ సదస్సులో మండల స్పెషల్ ఆఫీసర్ నాగమల్లేశ్వరరావు, మండల సర్వేయర్ శకుంతల, నాయకులు రత్నయ్య, ఈవో పి ఆర్ డి ఉమామహేశ్వర రావు, సర్వేయార్ కీర్తి, ఇన్చార్జి విఆర్ఓ కాటమ,రెవెన్యూ సిబ్బంది, వివిధ శాఖల సిబ్బంది తదితరులు ఉన్నారు.

## రహదారి సమస్యను పరిశీలించిన తహశీల్దార్



వాకాడు, డిసెంబర్ 20ప్రభాతవార్త : వాకాడు మండలం కొండాపురం గ్రామంలో జరిగిన రెవెన్యూ సదస్సులో శుక్రవారం వడ్డీపాలెం గ్రామంలోని రహదారి సమస్యను తహశీల్దార్ రామయ్య, మండల స్పెషల్ ఆఫీసర్ నాగమల్లేశ్వరరావు, మండల సర్వేయర్ శకుంతల, సర్వేయర్ కీర్తి, నాయకులు మోహన్ నాయుడు, గ్రామస్తులు సమక్షంలో రహదారిని పరిశీలించి ఎవరికి ఎలాంటి ఇబ్బంది కలగకుండా రహదారి ఏర్పాటు చేయాలని తాసిల్దార్ సూచించారు, అవసరమైతే పట్టాలో నుంచైనా దారి ఇవ్వాలని జీవో ఉందని తాసిల్దార్ సూచించారు, వెంటనే సంబంధించిన రెవెన్యూ సిబ్బందికి దారి ఏర్పాటు చేయాలని తాసిల్దార్ ఆదేశాలు ఇచ్చారు.

## పది మద్యం బాటిళ్ళు పటివేత



వాకాడు, డిసెంబర్ 20 ప్రభాతవార్త : చిట్టమూరు మండలం మొలకలపూడి గ్రామంలోని శుక్రవారం కమతం చంద్రశేఖర్ అనే వ్యక్తి వద్ద 10 మద్యం బాటిల్ లను ఎక్సైజ్ సీఐ ప్రసాద్, గూడూరు స్క్వాడ్ లు కలిసి పట్టుకున్నారు. స్థానికులు సమాచారం మేరకు కమతం చంద్రశేఖర్ అక్రమంగా బెల్ట్ షాపు నిర్వహిస్తు న్నారని ఇరువురు కలిసి దాడి చేశారు, అతని వద్ద మద్యం 10 బాటిల్లు ను స్వాదినపరుచుకొని కేసు నమోదు చేసే అరెస్ట్ చేశారు. ఈ దాడుల్లో గూడూరు స్క్వాడ్ సీఐ బాలకృష్ణ, పి వెంకటేశ్వర్లు, రమణయ్య,సిబ్బంది తదితరులు ఉన్నారు.

## డ్రగ్స్ పై విద్యార్థులకు అవగాహన



వాకాడు, డిసెంబర్ 20 ప్రభాతవార్త : కోటలోని ప్రగతి విద్యానికేతన్ లో విద్యార్థిని విద్యార్థులకు డ్రగ్స్ పై అవగాహన కల్పించారు. విద్యార్థులు దశలోనే చదువు పట్ల ఆశక్తితో చదవాలని ఉన్నత శిఖరాలను అందుకోవాలని అన్నారు, విద్యార్థిని విద్యార్థులు మాదగా ద్రవ్యాలను నివారించాలన్నారు, ఎవరైనా ప్రలోభాలు పెడితే తమ దృష్టికి తీసుకురావాలనన్ని ఎక్సైజ్ సీఐ ప్రసాద్ అన్నారు. ఈ సమావేశంలో గూడూరు స్పాడ్ సిఐ బాలకృష్ణ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పి వెంకటేశ్వర్లు, రమణయ్య, వెంకటసుబ్బయ్య, శ్రీనివాసులు, ప్రగతి కాలేజీ స్టాఫ్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.